మహిళల రక్షణకు కలిసికట్టుగా...

» హోం మంత్రి అనిత

మహిళల రక్షణకు 'కలిసికట్టుగా' పేరుతో రూపొందించిన కార్యక్రమాన్ని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో గురువారం హోం మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. -8లో



సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

మహా పక్షపాతం

ఆ నలుగురి వార్డులకే ఎడాపెడా నిధులు

» మేయర్, ఇద్దరు డిప్యూటీ మేయర్లు, వైసీపీ ఫ్లోర్ లీడర్ వార్డులకు అధిక ప్రాధాన్యం

» పబ్లిక్ వర్క్స్ నుంచి రూ.25 కోట్లు చొప్పున వ్యయం

» మిగిలిన వార్డుల్లో ఎక్కడా రూ.3 కోట్లు దాటని వైనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ పాలకవర్గం ఏర్పాటైన తర్వాత ఈ నాలుగేళ్లలో నలుగురు ముఖ్యుల వార్డుల్లోనే నిధులు కుమ్మరించారు. మేయర్, ఇద్దరు డిప్యూటీ మేయర్లు, వైసీపీ ఫ్లోర్ లీడర్‌లు తమ వార్డుల్లో అవసరం లేని పనులకు కూడా నిధులను మంజూరు చేయించుకున్నారు. వారి వార్డుల్లో సగటున రూ.25 కోట్లు చొప్పున పబ్లిక్ వర్క్స్ నుంచి ఖర్చు చేశారు. అదే మిగిలిన కార్పొరేటర్ల వార్డుల్లో కనీసం రూ.మూడు కోట్లు దాటలేదు.



గొలగాని హరివెంకటకుమారి



జియ్యాని శ్రీధర్



కట్టమూరి సతీష్



బాణాల శ్రీనివాసరావు

జీవీఎంసీ పరిధిలో 98 వార్డులు ఉన్నాయి. అన్ని వార్డులకు సమానంగా నిధులు కేటాయించాలి. సమస్యలు ఎక్కువగా ఉన్న వార్డులకు కాస్త అదనంగా మంజూరు చేయవచ్చు. అయితే అందుకు విరుద్ధంగా జరిగింది. నాలుగేళ్ల కిందట జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఎక్కువ వార్డులను గెలుచుకోవడంతో మేయర్‌గా 11వ వార్డు కార్పొరేటర్ గొలగాని హరివెంకటకుమారి, డిప్యూటీ మేయర్లుగా 52వ వార్డు కార్పొరేటర్ జియ్యాని శ్రీధర్, 46వ వార్డు కార్పొరేటర్ కట్టమూరి సతీష్ ఎంపికయ్యారు. వైసీపీ ఫ్లోర్ లీడర్‌గా 44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. కౌన్సిల్ ఏర్పడినప్పటి నుంచి జీవీఎంసీలో ఈ నలుగురి హవానే నడిచింది. వారు చెప్పిందల్లా అధికారులు చేశారు. స్వపక్ష కార్పొరేటర్లు కూడా వారికి అడ్డుచెప్పలేని పరిస్థితి ఏర్పడింది.

నగర అభివృద్ధిలో భాగంగా చేపట్టే ప్రాజెక్టులు, ప్రత్యేక నిధులతో జరిగే పనులను పక్కనబెడితే జీవీఎంసీ నిధులతో పబ్లిక్ వర్క్స్ కింద చేపట్టే పనులను తమ వార్డులకే అధికశాతం కేటాయించుకున్నారు. మిగిలిన వార్డుల్లో కూడా రోడ్లు, డ్రైనేజీ, సామాజిక భవనాలు, పార్కులు, ఫుట్‌పాత్‌లు, కల్వర్టులు, ప్రహరీ నిర్మాణం వంటి సమస్యలు ఉన్నప్పటికీ పట్టించుకోలేదు. ఆ నలుగురు మాత్రం తమ వార్డుల్లో చిన్నపాటి సమస్య ఉన్నా నిధులను మంజూరుచేసేలా ఒత్తిడి చేసి తమ పనులు పూర్తిచేసుకున్నారు. గత నాలుగేళ్లలో పబ్లిక్ వర్క్స్ కింద ఒక్కో వార్డులో సగటున రూ.మూడు కోట్లు విలువైన అభివృద్ధి పనులు జరిగాయి. స్టాండింగ్ కమిటీ సభ్యులుగా పనిచేసిన వారి వార్డుల్లో గరిష్ఠంగా రూ.ఐదు కోట్ల విలువైన పనులు జరిగాయి. కానీ మేయర్, డిప్యూటీ మేయర్‌లు, ఫ్లోర్‌లీడర్ వార్డుల్లో మాత్రం సగటున రూ.25 కోట్లు విలువైన పనులు జరగడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులో రూ.20 కోట్లు విలువైన పబ్లిక్ వర్క్స్ జరిగితే, ముడసర్లోవ రిజర్వాయర్ పరిరక్షణ పేరుతో మరో రూ.పది కోట్లతో ప్రహరీ గోడ నిర్మించారు. ఇక డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 52వ వార్డులో రూ.21 కోట్లు, మరో డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్ వార్డు (46)లో సుమారు రూ.23 కోట్లు, బాణాల శ్రీనివాసరావు వార్డు (44)లో సుమారు రూ.19 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరిగాయి. ఇవికాకుండా వీరి వార్డుల్లో గ్రీన్‌బెల్ట్ పరిరక్షణ, పార్కుల అభివృద్ధి పేరుతో మరో రూ.ఐదు కోట్ల వరకు ఇతర పద్దుల నుంచి ... మిగతా 6వ పేజీలో

కౌన్సిల్‌లోకి సభ్యులకు మాత్రమే అనుమతి

» మరెవరూ లోపలకు ప్రవేశించకుండా చూడాలి

» అవిశ్వాస తీర్మానంపై 19న కౌన్సిల్ సమావేశం జరగనున్న నేపథ్యంలో రో, ఐడెంటిఫికేషన్ అధికారులతో జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సమావేశం

» సమావేశం మొత్తాన్ని వీడియా తీయించాలని ఆదేశం

» 300 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్. చిత్రంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు రమణమూర్తి, వర్మ ఉన్నారు

విశాఖపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి):

మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై కూటమి కార్పొరేటర్లు అందజేసిన అవిశ్వాస తీర్మానం నోటీస్‌కు సంబంధించి ఈనెల 19న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం జరగబోతుండడంతో రో అధికారులు, ఐడెంటిఫికేషన్ అధికారులతో ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ గురువారం సమీక్ష నిర్వహించారు. సమావేశం జరిగే రోజు కేవలం వార్డు కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులను మాత్రమే లోపలకు అనుమతించాలని, సభ్యులను గుర్తించే బాధ్యత ఐడెంటిఫికేషన్ అధికారులదేనని కలెక్టర్ స్పష్టంచేశారు. గుర్తింపు కార్డులు పరిశీలించిన తర్వాత లోపలకు పంపించాలన్నారు. సభ్యులతోపాటు మరెవరూ లోపలకు రాకుండా ఐడెంటిఫికేషన్ అధికారులు చూడాలన్నారు. అందుకు అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు. కౌన్సిల్ హాల్‌లోకి సభ్యులు ప్రవేశించినప్పుడు తమ సెల్‌ఫోన్‌లను ఫ్లైట్ మోడ్‌లో పెట్టుకునేలా అధికారులు చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమైన తర్వాత కోరం సరిపోతే ఓటింగ్ ప్రారంభమవుతుందని, అప్పుడు చేతు లెత్తే సభ్యుల సంఖ్యను లెక్కించే ... మిగతా 6వ పేజీలో

5,74,905

ఇదీ జిల్లాలో ఉపాధి కోసం ఎదురుచూస్తున్న వారి సంఖ్య

» ఐటీ, అనుబంధ రంగాల కోర్సులు చేసినవారు 2,59,275 మంది

» డిగ్రీలో కామర్స్ పట్టభద్రులు 14,645 మంది

» ఆర్ట్స్ పట్టభద్రులు 10,965 మంది

» ఇతర సబ్జెక్టులు చదివిన పట్టభద్రులు 55,937 మంది



» ఒకటి నుంచి ఇంటర్ వరకు చదివిన వారు: 1,31,413

» వృత్తివిద్యా కోర్సులు పూర్తిచేసినవారు: 45,372

» నిరక్షరాస్యులు, ఇతరులు 20,663 మంది

» సచివాలయ ఉద్యోగుల సర్వేలో వెల్లడి

» నైపుణ్య శిక్షణ అందించేందుకు ప్రభుత్వం కసరత్తు

విశాఖపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఉపాధి కోసం ఎదురుచూస్తున్న వారి సంఖ్య దాదాపు ఆరు లక్షలకు చేరింది. ఇందులో ఐటీ అనుబంధ రంగాలతో పాటు ఇంజనీరింగ్, డిగ్రీ, వృత్తి విద్యా కోర్సులు పూర్తిచేసినవారు, నిరక్షరాస్యులు ఉన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు పెంచడం, శిక్షణ అందించడం, వర్క్ ఫ్రమ్ హోమ్ వైపు మొగ్గుచూపే వారిని గుర్తించడానికి గత నెలలో సచివాలయ సిబ్బంది ఇంటింటి సర్వే చేశారు.

సర్వేలో జిల్లాలో 19 నుంచి 50 ఏళ్లలోపు 6,31,260 మంది నుంచి వివరాలు సేకరించారు. దీనికి పలు అంశాలను ప్రాతిపదికగా తీసుకున్నారు. ఎలాంటి ఉపాధి లేనివారు 10,361 మంది ఉన్నారని గుర్తించగా, ఐటీ, అనుబంధ రంగాల కోర్సులు, డిగ్రీలు చేసినవారు 3,15,630 మంది ఉన్నారని తేల్చారు. ఏదో ఒక ఉద్యోగం చేస్తున్నవారు 56,355 మంది, ఏ ఉద్యోగమూ లేని వారు 2,59,275 మంది ఉన్నారు. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి అర్హత ఉండి ఉపాధి లేని వారి సంఖ్య 26,094, పదో తరగతి పూర్తిచేసిన వారు 51,907, ఇంటర్ చదివినవారు 53,412, డిప్లమో చేసినవారు 21,222 మంది ఉన్నారు. డిగ్రీలో కామర్స్ పట్టభద్రులు 14,645 మంది, ఆర్ట్స్ పట్టభద్రులు 10,965 మంది, ఇతర సబ్జెక్టులు చదివిన పట్టభద్రులు 55,937 మంది, వైద్య విద్య పూర్తిచేసినవారు 519, న్యాయ పట్టభద్రులు 479, పీజీ చదివినవారు 22,589 మంది, పీహెచ్‌డీ తీసుకున్న 563 మంది, ఇతరులు 10,302 మంది ఏ ఉపాధి లేని వారిగా గుర్తించారు.

నగరంలోనే అధికం...

ఉపాధి లేని వారిలో అధిక శాతం నగరంలోనే ఉన్నారు. గ్రామీణ మండలాల్లో తక్కువ మంది ఉన్నారని తేలింది. ఇదిలావుండగా ఏ ఉపాధీ లేని వారికి నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. తగిన విద్యార్హతలున్నవారికి ఇంటి నుంచే (వర్క్‌ఫ్రమ్ హోమ్) పనిచేసేలా వివిధ సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషిచేస్తోంది. కాగా నైపుణ్యం పెంచుకుని, ఉపాధి పొందడానికి, ఇళ్ల నుంచి పనిచేయడానికి అధికశాతం మంది మొగ్గుచూపుతున్నారు. వీరిలో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉన్నట్టు సర్వేలో తేలింది.

పీజీకి ఫీజు రీయింబర్స్‌మెంట్



» మంత్రి నారా లోకేశ్ ప్రకటనతో విద్యార్థుల్లో ఆనందం

» ఈ విద్యా సంవత్సరం నుంచే అమలుచేసే అవకాశం

» వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిపివేత

» నాలుగేళ్లు పీజీ కోర్సులకు దూరమైన వేలాది మంది



విశాఖపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి):

'పిల్లలను గొప్పగా చదివించాలి. చదివే అవకాశాన్ని తల్లిదండ్రులు కల్పించాలి. చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఆటంకం కాకూడదు. ఆ ఉద్దేశంతోనే పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ తీసుకువస్తున్నాం.' విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ పీజీ కోర్సుల ఫీజు రీ యింబర్స్‌మెంట్ పథకాన్ని పునరుద్ధరించే దిశగా చేసిన వ్యాఖ్యలు.

ఇంటర్‌లో టాప్ ర్యాంకులు సాధించిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులతో ఆయన ఇటీవల సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని వర్తింపజేస్తామని స్పష్టం చేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది నిరుపేద ప్రతిభ కలిగిన విద్యార్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ హయాంలో నిలిపివేత

గత వైసీపీ ప్రభుత్వం పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పూర్తిగా నిలిపేసింది. దీంతో నిరుపేద వర్గాలకు చెందిన వేలాది మంది పీజీ కోర్సులు చేయలేని దుస్థితి ఏర్పడింది.

ఏటా ఐదు వేల మందికి మేలు..

ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో ... మిగతా 6వ పేజీలో

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల వెల్లువ

కత్తిమీద సాములా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ

ప్రజా ప్రతినిధుల ద్వారా ఒత్తిడి

» తలలు పట్టుకుంటున్న అధికారులు

» జూన్ 6 నాటికి గ్రౌండ్ చేయాలన్న ప్రభుత్వం

» సిబిల్ స్కోరు తక్కువగా ఉన్న వారికి రుణాలు ఇవ్వలేమంటున్న బ్యాంకులు



విశాఖపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి):

వివిధ సంక్షేమ శాఖల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలందించే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఆశావహులు భారీగా దరఖాస్తులు సమర్పించారు. దీంతో లబ్ధిదారుల ఎంపిక అధికారులకు కత్తిమీద సాములా మారింది. అంతేకాదు రుణాలు మంజూరయ్యేలా చూడాలంటూ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులకు వినతులు వెల్లువెత్తుతుండడంతో వారంతా తల పట్టుకుంటున్నారు.

బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో సబ్సిడీతో కూడిన స్వయం ఉపాధి రుణాలను అందించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు ఈ ప్రక్రియను పూర్తిగా పక్కనపెట్టేయడంతో ఆశావహుల సంఖ్య భారీగా పెరిగిపోయింది. జిల్లాలో బీసీ, ఈబీసీ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్లకు 2,368 యూనిట్లను ప్రభుత్వం మంజూరుచేసింది. ఇందుకోసం 18,984 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల తొలి విడతగా 400 మందికి అధికారులు రుణాలను మంజూరుచేశారు. రెండో దశలో మిగిలిన మొత్తం యూనిట్లకు లబ్ధిదారులను ఎంపిక చేసి, రుణాలు అందించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ, ప్రభుత్వం విధించిన గడువులోగా గ్రౌండింగ్ చేయడం కష్టతరంగా మారిందని చెబుతున్నారు.

విపరీతమైన పోటీ

జిల్లాకు మంజూరుచేసిన యూనిట్ల మేరకు చూసుకుంటే ఒక్కో యూనిట్‌కు కనీసం నలుగురు నుంచి పది మంది వరకు పోటీ పడుతున్నారు. లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను ఎంపీడీవోలు, జోనల్ కమిషనర్లకు ప్రభుత్వం అప్పగించింది. వీరు స్థానిక నేతల ద్వారా అందిన జాబితాకే ప్రాధాన్యమిస్తారన్న ప్రచారం నేపథ్యంలో దరఖాస్తుదారులంతా నేతల ... మిగతా 6వ పేజీలో

జనసేనలో చేరిన బెహరా భాస్కరరావు

గోపాలపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మాజీ కార్పొరేటర్ బెహరా భాస్కరరావు గురువారం మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో జనసేనలో చేరారు. ఆయనతో పాటు అడవివరం కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్‌లు గునిశెట్టి శ్రీనివాసరావు, గేదెల మురళీకృష్ణ, గోపాలపట్నంకు చెందిన పలువురు జనసేన కండువా కప్పుకున్నారు. బెహరా భాస్కరరావు నాలుగు రోజుల కిందట వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.



రాష్ట్రమంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరిన బెహరా భాస్కరరావు

వైసీపీకి మరో కార్పొరేటర్ గుడ్‌బై

» వ్యక్తిగతకారణాలతో రాజీనామా చేస్తున్నట్టు ముత్తంశెట్టి ప్రియాంక లేఖ



విశాఖపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి):

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మరొక కార్పొరేటర్ గుడ్‌బై చెప్పేశారు. వ్యక్తిగత కారణాలతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కుమార్తె, జీవీఎంసీ ఆరో వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక గురువారం లేఖ విడుదల చేశారు. జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై కూటమి నేతలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీస్‌పై కౌన్సిల్ సమావేశం జరగడానికి రెండు రోజులు ముందు ఆమె వైసీపీని వీడడంతో ఆ పార్టీ నేతల్లో ఆందోళన పెరిగింది. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌లో కూటమికి ఆమె మద్దతుగా నిలుస్తారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుమారుడు 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డితోపాటు బెహరా భాస్కరరావు భార్య 92వ వార్డు కార్పొరేటర్ స్వర్ణలత, కోడలు, 91వ వార్డు కార్పొరేటర్ కుంచె జ్యోత్స్న వైసీపీని వీడి జనసేనలో చేరిపోయారు.

అభివృద్ధిలో ముందుండాలి

జిల్లా స్థాయి అభివృద్ధి సమన్వయ, మానటరింగ్ కమిటీ (దిశా) సమావేశంలో అధికారులతో ఎంపీ ఎం.శ్రీభరత్

» ప్రధానంగా విద్య, వైద్య, వ్యవసాయ రంగాలపై దృష్టిసారించాలి

» ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీల్లో పిల్లల సంఖ్య పెంచాలి

» క్రీడా మైదానాలు, స్టేడియాలను అభివృద్ధి చేయాలి

» కప్పరాడ ఉన్నత పాఠశాల, గాజువాక నుంచి లంకెలపాలెం వరకూ సర్వీస్ రోడ్డు అభివృద్ధికి ప్రతిపాదనలు



జిల్లా స్థాయి అభివృద్ధి సమన్వయ, మానటరింగ్ కమిటీ (దిశా) సమావేశంలో పాల్గొన్న ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, విష్ణుకుమార్‌రాజు, కలెక్టర్ హరేంధిరప్రసాద్, అధికారులు

విశాఖపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి):

విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి అధికారులంతా ప్రత్యేకంగా కృషిచేయాలని, జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో నిలపాలని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి అభివృద్ధి సమన్వయ, మానటరింగ్ కమిటీ (దిశా) సమావేశంలో కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరుతెన్నులు, క్షేత్రస్థాయి పరిస్థితులను ఆయన సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరే పిల్లల సంఖ్యను పెంచాలన్నారు. గత సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలు, వాటిపై తీసుకున్న చర్యల గురించి అధికారులను సమీక్షించారు. ప్రతి ఒక్కరూ జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ ... మిగతా 6వ పేజీలో

రేపటి నుంచి లడ్డూ విక్రయాలు పునఃప్రారంభం

సాగర్‌నగర్ / ఎండాడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో ఉన్న శ్రీమహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి లడ్డూ విక్రయాలను పునఃప్రారంభించనున్నట్టు ఏఈఓ జగన్మోహనాచార్యులు తెలిపారు.గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల ఒంటిమిట్టలో జరిగిన సీతారామ కల్యాణ మహోత్సవానికి శ్రీవారి లడ్డూలు తరలించడంతో ఇక్కడ విక్రయాలు నిలిపివేయాల్సి వచ్చిందన్నారు. ఈనెల 19 నుంచి యథావిధిగా కౌంటర్‌లో లడ్డూ విక్రయాలు జరుగుతాయని చెప్పారు.

గత తప్పిదాలపై చర్యలు ఏవీ ?

సింహాచలం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామికి గతంలో జరిగిన చందనోత్సవాల్లో అనేక తప్పిదాలు జరిగాయి. వాటిపై ఉన్నతాధికారులు ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. 2021లో జరిగిన చందనోత్సవం కరోనా వల్ల ఏకాంత సేవగా నిర్వహించారు. అప్పుడు దేవస్థానం సిబ్బందిని కూడా దర్శనానికి అనుమతించలేదు. అంతటి కట్టుదిట్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ నలభై మంది రహస్యంగా నిజరూప దర్శనం చేసుకున్నట్టు విమర్శలు వచ్చాయి. దేవస్థానంతో ఎటువంటి సంబంధం లేని వ్యక్తి స్వామివారి నిజరూప దర్శనం చేసుకున్న వీడియో కూడా సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. అలాగే రెండేళ్ల అంతరాలయంలోని మూల విరాట్‌ను ఫొటో తీసి వైరల్ చేశారు. ఇటువంటి ఘోర తప్పిదాలు జరిగినా దేవదాయ శాఖ అధికారులు మీడియా ముందు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశామని, శాఖాపరమైన విచారణ చేపడతామని ప్రకటించారు తప్ప చర్యలు తీసుకోలేదు.



జోన్ 2 కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మునిసిపల్ కార్మికులు



భీమిలిలో సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

సమస్యలు పరిష్కరించాలి

జోనల్ కార్యాలయాల ఎదుట మునిసిపల్ కార్మికుల ధర్నా

కొమ్మాది, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మునిసిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు ఎంవీ ప్రసాద్ అన్నారు. గురువారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో జోన్-2 కార్యాలయం వద్ద మునిసిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వాలు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. ప్రతి నెలా 1న జీతాలు ఇవ్వాలని, పనులు చేయడానికి పరికరాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు అప్పలరాజు, సీఐటీయూ నాయకులు సీహెచ్ శేషుబాబు, బి, రత్నం, బి. నరసింగరావు, బి. అప్పారావు పాల్గొన్నారు.

భీమునిపట్నం : ఔట్ సోర్సింగ్ కార్మికుల సంక్షేమానికి దోహదపడుతున్న ఏపీ కార్పొరేషన్ ఫర్ అవుట్ సోర్సిడ్‌సర్వీసెస్ (ఆప్కాస్)ను రద్దు చేయాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం భీమిలి డివిజన్ సీఐటీయూ ఆధ్వర్యంలో జోన్ వన్ కార్యాలయం వద్ద కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీటూ నాయకుడు ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ కార్మికుల నియామకాల్లో, వేతన చెల్లింపుల్లో పారదర్శకత, కచ్చితత్వం ఉండేలా ఆప్కాస్ ఎంతో దోహపడుతుందన్నారు. కార్మికులకు ప్రయోజనకరమైన ఆప్కాస్‌ను రద్దు చేయాలన్న ప్రభుత్వం ఆలోచన సరికాదని పేర్కొన్నారు. సీటూ నాయకుడు అప్పలనాయుడు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, కార్మికులకు జీవో నంబరు 36 ప్రకారం కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. అనంతరం జోనల్ కార్యాలయం సూపరింటెండెంట్ ఎస్. శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రవ్వ నరసింగరావు, సురేశ్, చిన్నబాబు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీబాల వీరాంజనేయస్వామి

వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి
- మధురవాడలోని సాంఘిక సంక్షేమ వసతి గృహం తనిఖీ

మధురవాడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు కనీస సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన మధురవాడలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించారు. తొలుత డార్మిటరీ, వంటగది, వాష్ రూమ్స్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న బాయ్స్ హాస్టల్ భవనాలను తొలగించి, స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించాలని ఆ శాఖ డీడీ రామారావును ఆదేశించారు. వసతి గృహంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. పనులు కొనసాగింపులో అదనపు ప్రతిపాదనలు ఉంటే చేయించాలన్నారు. విద్యార్థులకు సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం వెనుకాడదని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. ఎప్పటికప్పుడు కిందిస్థాయి అధికారులతో సమీక్షించాలని డీడీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, భీమిలి ఆర్డీఓ సంగీత్‌మాధుర్, విశాఖ అర్బన్ తహసీల్దార్ రమేశ్, ఏఎస్‌డబ్ల్యూఓ రమాదేవి, వసతిగృహం సంక్షేమాధికారులు రమేశ్, బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధర తగ్గించాలని సీపీఐ నిరసన

తగరపువలస, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గ్యాస్ ధర తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు, కార్యకర్తలు తగరపువలస కూడలిలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి కానూరి రాంబాబు మాట్లాడుతూ గ్యాస్‌పై అదనంగా రూ.50 పెంచడం,రాయితీ సొమ్ము బ్యాంకు ఖాతాల్లో సక్రమంగా జమ కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మొర అప్పలరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఇప్పటివరకు ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. అనంతరం అంబేడ్కర్ కూడలి నుంచి వైఎస్ఆర్ కూడలి వరకు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు చిల్ల సూరిబాబు, అల్లం గోవిందరావు, లక్ష్మణరావు, సన్నిబాబు. రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

తగరపువలస, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు జీరుపేటకు చెందిన బైరెడ్ల రామకృష్ణ (36) రెండు రోజులుగా కనిపించడం లేదని అతని కుటుంబ సభ్యులు భీమిలి పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. అతను కొంతకాలంగా మానసికంగా ఇబ్బంది పడుతున్నాడని, బుధవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయారని చెప్పారు. యువకుడి తండ్రి నారాయణమూర్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు దివీస్ ఆర్థిక సాయం

తగరపువలస, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు దివీస్ కంపెనీ రూ1.65 లక్షల ఆర్థిక సహాయం అందజేసింది. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి వివిధ పన్నుల రూపంలో ఏయూకు రూ 1.65 లక్షల బకాయి ఉందని, ఆర్థిక వనరులు లేకపోవడంతో చెల్లించలేకపోతున్నామని దివీస్ యాజమాన్యానికి తెలిపారు. ఈమేరకు కంపెనీ ప్రతినిధులు గురువారం రూ 1.65 లక్షల చెక్కును ప్రిన్సిపాల్‌కు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకుడు బి. సీతం నాయుడు, దివీస్ ప్రతినిధులు ఏ. శ్రీనివాస్, శేఖర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కొమ్మాది, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : చంద్రంపాలెం జాతర గుట్ట దుర్గాలమ్మ ఆలయం వద్ద గురువారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో పాదచారులు, వాహనదారుల దాహార్తి తీర్చేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.నెల రోజుల పాటు కేంద్రాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, కార్యదర్శి నాగోతి తాతారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆనందపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని ఏఈ అప్పలనాయుడు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పొడుగుపాలెం, చందక, వెంకటాపురం, జగన్నాథపురం, గొట్టిపల్లి, కుసులువాడ, ఆనందపురం, సుఖీభవ లేఅవుట్ ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు.

20న నేత్ర వైద్య శిబిరం

పద్మనాభం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఈనెల 20న స్థానిక సచివాలయం వద్ద ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సత్యసాయి సేవా సమితి విశాఖ జోన్ కోఆర్డినేటర్ సాయికుమార్ చెప్పారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి వైద్యులతో రోగులను పరీక్షించి, అవసరమైన వారికి శస్త్ర చికిత్స చేయిస్తామన్నారు.

రహదారిని ఆక్రమిస్తే చర్యలు : జోన్-2 జడ్సీ



వ్యాపారిని హెచ్చరిస్తున్న జడ్సీ కనకమహాలక్ష్మి

మధురవాడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మధురవాడలోని రోజువారీ మార్కెట్‌లో కొందరు రహదారి స్థలాన్ని ఆక్రమించి వ్యాపారాలు చేయడంతో జోన్-2 జడ్సీ కనక మహాలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. మధురవాడ జంక్షన్ నుంచి పీహెచ్‌సీ వరకు కొందరు రోడ్డుకు ఇరువైపులా స్థలాలు ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండడంతో కార్పొరేటర్ మంగమ్మకు పలువురు ఫిర్యాదు చేశారు. రోడ్డు ఆక్రమణకు గురవ్వడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి.దీనిపై కార్పొరేటర్, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం జడ్సీ సిబ్బందితో కలిసి మార్కెట్‌లో పర్యటించారు. రోడ్డు పక్కన స్థలాలుఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిని హెచ్చరించారు. రహదారికి అడ్డంగా బల్లలు, కర్రలు వేసి వ్యాపారాలు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి నెలలో ఒక రోజు మార్కెట్లో పర్యటిస్తానని మళ్లీ ఆక్రమణలు ఉంటే వారికి మార్కెట్లో వ్యాపారం చేయడానికి అవకాశం ఇవ్వమని హెచ్చరించారు.

అభివృద్ధిలో ముందుండాలి

... 5వ పేజీ తరువాయి

సందర్భంగా జిల్లాలో అమలవుతున్న పథకాల వివరాలను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ వివరించారు.

తవ్విన రోడ్లు వెంటనే పూడ్చండి


వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం నగరంలో తవ్విన రోడ్లను వెంటనే పూడ్చాలని ఎంపీ శ్రీభరత్ ఆదేశించారు. భూగర్భ విద్యుత్ లైన్లు, తాగునీటి పైపులైన్లు, యూజీడీ ఏర్పాటుకు పలుచోట్ల రోడ్లను తవ్వేస్తున్నారని, వాటి వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేలు గణబాబు, పంచకర్ల రమేష్‌బాబు ప్రస్తావించడంతో ఎంపీ స్పందించారు. నిర్దేశించిన పనులు పూర్తయిన వెంటనే గోతులు పూడ్చాలని, కొత్తగా వేసిన రహదారులు తవ్వకుండా ప్రణాళికాయుతంగా చర్యలు చేపట్టాలన్నారు. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ గేట్ల మరమ్మతులకు జీవీఎంసీ నిధుల వినియోగంపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలన్నారు. 'రాజీవ్ గృహకల్ప' పథకంలో నిర్మించిన ఇళ్లకు మరమ్మతులు చేయాలని, ఇప్పటికీ వినియోగించుకోని లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వాలని అధికారులకు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సూచించారు. కప్పరాడ ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేయాలని ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు విష్ణుకుమార్‌రాజు కోరగా అందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విద్యాశాఖాధికారులను ఎంపీ ఆదేశించారు. తప్పుడు పత్రాలు సమర్పించే వ్యక్తులకు విద్యుత్ సౌకర్యం కల్పించవద్దని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు కోరారు. ఇంకా ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో క్రీడా మైదానాలు, స్టేడియాలను అభివృద్ధి చేయాలని, వేసవి క్యాంపులు నిర్వహించాలని, ఉద్యానవన, సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ విధానాలను ప్రోత్సహించాలన్నారు. గాజువాక నుంచి లంకెలపాలెం వరకూ సర్వీస్ రోడ్డు అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సూచన మేరకు ప్రతిపాదన చేయాలని సంబంధిత అధికారులకు ఎంపీ ఆదేశించారు. వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లలో కెపాసిటీ పెంచాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, డీఆర్వో భవానీశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తీర ప్రాంతాలకు అరకొరగా బస్సు సర్వీసులు

సాగర్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని తీర ప్రాంత గ్రామాలకు బస్సు సర్వీసులు అరకొరగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. 20 ఏళ్ల కిందట సాగర్‌నగర్, రుషికొండ ప్రాంతాలకు 51, 52ఎస్, 17బీ బస్సులను సింహాచలం, పెదవాల్తేరు డిపోల నుంచి నడిపేవారు. సాగర్‌నగర్ నుంచి ఆర్‌టీసీ కాంప్లెక్స్,రైల్వేస్టేషన్, కంచరపాలెం, ఎన్ఏడీ, గోపాలపట్నం మీదుగా సింహాచలం వెళ్లేందుకు 51 సర్వీసు ప్రజలకు ఎంతో అనుకూలంగా ఉండేది. ఈ సర్వీసు తీసేసిన తరువాత నుంచి అప్పన్న భక్తులు సింహాచలం వెళ్లడానికి వ్యయప్రయాసాలకు గురవుతున్నారు. ప్రస్తుతం తీర ప్రాంత గ్రామాలు అభివృద్ధి చెందడమే కాకుండా జనాభా కూడా పెరిగింది. ఈ ప్రాంతం జీవీఎంసీలో విలీనం కాకముందు బస్సు సర్వీసులు ఎక్కువగా ఉండేవి. జీవీఎంసీలో విలీనమైన తరువాత సర్వీసులు పెంచాల్సింది పోయి తగ్గించేశారు. తీర ప్రాంత వాసులు సాగర్‌నగర్, రుషికొండ తదితర ప్రాంతాలకు చేరుకోవాలన్నా,ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా బస్టాప్‌ల్లో గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. ప్రస్తుతం రైల్వేస్టేషన్, ఆర్‌టీసీ కాంప్లెక్స్ మీదుగా సాగర్‌నగర్, భీమిలి వరకు నడిచే 900 కె సర్వీసు మాత్రమే ప్రజలకు దిక్కు. ఇది కూడా కొన్ని సమయాల్లో మాత్రమే అందుబాటులో ఉంటుంది. హైవేకు ఆవతల ఉన్న ఆరిలోవ, తదితర ప్రాంతాలకు ప్రతి పది నిమిషాలకు ఒక సర్వీసు నడుస్తుండగా ఐటీ హబ్‌గా అభివృద్ధి చెందుతున్న రుషికొండకు మాత్రం గంటకు ఒక సర్వీసులు కూడా ఉండడం లేదు. ఈ విషయమై పాలకులు, అధికారులు దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

అప్పుడు మేయర్‌కు కన్నీరు రాలేదా?

జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్



విశాఖపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): 'యాదవ సామాజికవర్గానికి చెందిన తనను మేయర్ పీఠం నుంచి దింపడానికి తన సామాజికవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులే కుట్ర చేస్తున్నారని గొలగాని హరివెంకటకుమారి మొసలికన్నీరు కార్చుతున్నారని జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్‌అన్నారు. వైసీపీ హయాంలో తన సామాజికవర్గం కార్పొరేటర్లకు అన్యాయం జరిగితే కన్నీరురాలేదా?' అని ప్రశ్నించారు. జీవీఎంసీలోని టీడీపీ ఫ్లోర్‌లీడర్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావే శం ఏర్పాటుచేశారు. వంశీకృష్ణ శ్రీనివాస్ కార్పొరేటర్‌గా 21వవార్డులో రోడ్డు నిర్మాణానికి నిధులుమంజూరు చేయాలని కౌన్సిల్‌లో కోరితే మేయర్ పట్టించుకోలేదన్నారు. యాదవ కార్పొరేటర్లు తమ వార్డులో అభివృద్ధి పనులు జరగడం లేదని, నిధులడిగితే సామాజికవర్గం గుర్తుకురాలేదా? అని ప్రశ్నించారు. మేయర్‌గా నాలుగేళ్లు పని చేసిన హరివెంకటకుమారికి ఇంతవరకు ఫోన్ లేదన్నారు. షాడోమేయర్ అవినీతి నేపథ్యంలోనే అవిశ్వాసం పెట్టాల్సి వచ్చిందన్నారు. కోడివ్యర్థాల పంచాయితీ మేయర్ ఇంట్లోనే జరిగిందన్నారు. మేయర్, డిప్యూటీ మేయర్, వైసీపీ ఫ్లోర్‌లీడర్ ప్రతినెలా మామూళ్లు తీసుకుంటున్నారన్నారు. డిప్యూటీ మేయర్ శ్రీధర్ ఆనందపురం మండలం గిడిజాలలో ఐదు ఎకరాల భూమిని ఆక్రమించారన్నారు. వైసీపీ నేతలు విప్ జారీచేస్తున్నామని వైసీపీ కార్పొరేటర్లను బెదిరిస్తున్నారని, వారికి దానిపై అవగాహనలేదన్నారు. టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాక వైసీపీ సమన్వయకర్తగా యాదవ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని నియమిస్తే, అతన్ని తొలగించి అమర్‌నాథ్ టికెట్‌లాక్కుంటే మేయర్ ఏం చేశారని ప్రశ్నించారు.



పేపర్ ప్లేట్లలో భోజనాలు చేస్తున్న భక్తులు

అధికారులకు పట్టని ఈఓ ఆదేశాలు

సింహాచలం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం ఈఓ కొమ్ముల సుబ్బారావు ఆదేశాలు అధికా రులకు పట్టడం లేదు. గత నెల 15వ తేదీన సింహగిరిపై జరిగిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో బాగంగా ఈఓ అన్న ప్రసాద విభాగంలో భక్తులకు విస్తరాకులు లేదా స్టీల్ కంచాల్లో భోజనాలు వడ్డించాలని ఆదేశించారు. కానీ ఇప్పటికీ అధికారులు పేపర్ ప్లేట్లలోనే భక్తులకు భోజనాలు అందిస్తున్నారు. ఈఓ ఆదేశాలు జారీ చేసి నెల రోజులు కావస్తున్నా.. సిబ్బంది పట్టించుకున్న దాఖలాలు లేవు.

కాలువల్లో పూడికతీత

మధురవాడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ పరిసరాల్లోని కాలువల్లో పూడికలు పేరుకుపోవడంతో మురుగు నీరు బయటకు వచ్చి వీధులు అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. మధురవాడ రోజు వారీ మార్కెట్, చంద్రంపాలెం, ఎత్తు వంతెన కిందన ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. ఏ మాత్రం వర్షం పడినా కాలువలు పొంగి మురుగు నీరు రోడ్లపైకి వస్తోంది. ఈ సమస్యను కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ జడ్సీ దృష్టికి తీసుకువెళ్లడంతో జీవీఎంసీ సిబ్బంది గురువారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. మార్కెట్‌తో పాటు పలు చోట్ల కాలువల్లో పూడికలు తొలగించారు.

'తాగునీటి సమస్య తీర్చాలి'



ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

ఆనందపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్‌వీపాలెం పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీకి తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట దళిత సంఘాల నాయ కులు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర దళిత నాయకుడు బాగం గోపాలరావు మాట్లా డుతూ 40 ఏళ్లుగా కాలనీవాసులు తాగునీటి కోసం పోరాటం చేస్తున్నా, ప్రభుత్వాలు స్పందించకపోవడం శోచనీయమన్నారు. వెంటనే కాలనీకి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించడంతో పాటు ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఎంపీడీవో జానకికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో దళిత నాయకులు సియ్యాద్రి రాంబాబు, బోని సన్నిబాబు, బోని ప్రసాద్ పాల్గొన్నారు.

మహా పక్షపాతం

... 5వ పేజీ తరువాయి

ఖర్చు చేశారు.

మిగిలిన కార్పొరేటర్లు గగ్గోలు

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం జరిగిన ప్రతిసారీ పలువురు కార్పొరేటర్లు తమ వార్డుల్లో అభివృద్ధి పనులు జరగడం లేదంటూ గగ్గోలు పెట్టేవారు. మేయర్, డిప్యూటీ మేయర్లు, ఫ్లోర్ లీడర్‌తో పాటు మరికొందరి వార్డులకే భారీగా నిధులు మంజూరు చేస్తున్నారంటూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కార్పొరేటర్లతో పాటు వైసీపీ సభ్యులు కూడా ఆగ్రహం వ్యక్తంచేసేవారు. దీనిపై వివరణ ఇవ్వడానికి అధికారులు కూడా నీళ్లు నమిలేవారు. రాజకీయ స్వలాభంతో పాటు కాంట్రాక్టర్ల నుంచి పర్సంటేజీల వస్తాయనే భావనతోనే తమ తమ వార్డులకు ఎక్కువ నిధులు మంజూరు చేయించుకున్నారని కార్పొరేటర్లు విమర్శలు గుప్పించినా ఆ నలుగురు మాత్రం మౌనం వహిస్తూ వచ్చారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఆనందపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీఓ జానకి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల లెవెల్ పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు అంశాలపై అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణి లకు సామూహిక సీమంతాలు చేశారు.

వాట్సాప్ గవర్నెన్స్ పోస్టర్ ఆవిష్కరణ

మహారాణిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అందుబాటులోకి తీసుకువచ్చిన 9552300009 వాట్సాప్ నెంబరు ద్వారా అన్ని రకాల ప్రభుత్వ సేవలను సులభంగా పొందవచ్చని ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. గురువారం వారు కలెక్టరేట్‌లో వాట్సాప్ గవర్నెన్స్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలు సులభరీతిలో సేవలు పొందవచ్చునని చెప్పారు. హాయ్ అని మెసేజ్ చేయడం ద్వారా తమకు కావాల్సిన సేవలను ఎంపిక చేసుకోవచ్చునని చెప్పారు.

'పరీక్షలు, మార్కులే జీవితం కాదు'

పద్మనాభం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు పరీక్షలు, మార్కులే జీవితం కాదని సమగ్ర శిక్ష అభియాన్ వృత్తి, మానసిక ఆరోగ్య కౌన్సిలర్లు అన్నారు. పదో తరగతి ఫలితాలు విడుదల కానున్న నేపథ్యంలో పరీక్షలు రాసిన విద్యార్థుల్లో మనోధైర్యం నింపడానికి భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల కేజీబీవీ బాలికలకు గురువారం పద్మ నాభంలో పరీక్షలు మార్కులే జీవితమా అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షల్లో ఒకసారి తప్పినంత మాత్రాన జీవితం మొత్తం కోల్పోయినట్టు కాదన్నారు. పరీక్షల్లో తక్కువ మార్కులు పొందిన ఎంతోమంది జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ డాక్టర్ చంద్రశేఖర్ జీసీడీఓ కాలేషా బేగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు గ్రేస్‌లిల్లీ, కుమారి గంగ, కౌన్సిలర్లు కృష్ణవేణి, ఝాన్సీ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్‌లోకి సభ్యులకు మాత్రమే అనుమతి

... 5వ పేజీ తరువాయి

బాధ్యత రో అధికారులదేనని కలెక్టర్ వివరించారు. ఒక్కో రో అధికారి తమకు కేటాయించిన వరుసలో ఎంతమంది చేతులు ఎత్తారనేది పేర్లతో సహా నమోదుచేసుకుని, కార్యదర్శికి అందజేయాల్సి ఉంటుందని కలెక్టర్ వివరించారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలతోపాటు అదనంగా మరికొన్ని వీడియో కెమెరాలను కూడా ఏర్పాటుచేయాలని ఆదేశించారు. సమావేశం ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీయించాలని కలెక్టర్ ఆదేశించారు.

పటిష్ఠ భద్రత

కౌన్సిల్ సమావేశానికి పోలీసులు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేస్తున్నారు. 19వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకోనున్నారు. జీవీఎంసీ ఉద్యోగులు, వార్డు కార్పొరేటర్లు,ఎక్స్‌అఫీషియో సభ్యులను మినహా మిగిలిన వారు లోపలకు ప్రవేశించకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న సీఎంఆర్ బస్టాప్ నుంచి సంపత్ వినాయగర్ ఆలయానికి వెళ్లే రోడ్డు మినహా జీవీఎంసీ కార్యాలయం చుట్టూ ఉన్న రోడ్లను బారికేడ్లతో మూసివేయనున్నారు. ఆ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 210 మంది శాంతిభద్రతల విభాగం సిబ్బంది, 90 మంది ట్రాఫిక్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులు నిర్ణయించారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల వెల్లువ

... 5వ పేజీ తరువాయి

చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలను ఇప్పటికే పూర్తిచేశారు. కానీ ఆయా వార్డులు/గ్రామాలకు కేటాయించిన యూనిట్ల జాబితాను అనేకచోట్ల ఫైనల్ చేయలేదు. అధికసంఖ్యలో దరఖాస్తులు రావడం, వారంతా నేతల చుట్టూ ప్రదక్షిణలు చేయడమే దీనికి కారణమని తెలుస్తోంది. కొన్నిచోట్ల నాయకులు ఫైనల్ జాబితాను అధికారులకు పంపారు. రుణాలకు ఎంపికైన వారితో జూన్ ఆరో తేదీ నాటికి యూనిట్లను గ్రౌండింగ్ చేయించాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు ప్రక్రియను వేగవంతం చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. అయితే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొలిక్కి రాకపోవడం సమస్యగా మారిందంటున్నారు.

విల్లింగ్‌కు బ్యాంకులు నో..

వివిధ ఉపాధి యూనిట్లకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ అందిస్తుండగా, 50 శాతం బ్యాంకు రుణంగా ఇస్తుంది. కానీ కొన్నిచోట్ల బ్యాంకులు రుణాలు అందించేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. పాత రుణాలున్న వారికి, క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉన్నవారికి రుణాలివ్వలేమని బ్యాంకు అధికారులు తేల్చి చెబుతున్నారు. యువత, రైతులు గతంలో బ్యాంకుల నుంచి తీసుకున్న వ్యవసాయ రుణాలు మాఫీ అవుతాయన్న ఆశతో చెల్లించలేదు. దీంతో క్రెడిట్ స్కోర్ తగ్గిపోయింది. ఇది తాజా సబ్సిడీ రుణాల మంజూరుకు అవరోధంగా మారిందంటున్నారు.

పీజీకి ఫీజు రీయింబర్స్‌మెంట్

... 5వ పేజీ తరువాయి

సుమారు 50కు పైగా ప్రైవేటు పీజీ కాలేజీలు ఉన్నాయి. గతంలో ప్రైవేటు కాలేజీల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం పథకాన్ని వర్తింపచేసింది. వైసీపీ ప్రభుత్వం ప్రైవేటు కాలేజీల్లో పీజీ కోర్సులు చేసే విద్యార్థులకు పథకాన్ని నిలిపేసింది. దీంతో ఆర్థికంగా మెరుగైన విద్యార్థులు మాత్రమే ప్రైవేటు కాలేజీల్లో చేరారు. గత ప్రభుత్వ నిర్ణయంతో అనేక పీజీ కాలేజీల్లో సీట్లు మిగిలిపోయాయి. కూటమి ప్రభుత్వం మళ్లీ పథకాన్ని వర్తించేలా చర్యలు తీసుకోవడంతో విద్యార్థులతోపాటు పీజీ కాలేజీ యాజమాన్యాలు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ఏయూ పరిధిలోని ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లోని కాలేజీల్లో సుమారు ఐదు వేల మంది విద్యార్థులకు పీజీ చేసే అవకాశం లభించనుంది. మేనేజ్‌మెంట్ కోటా సీట్లు పోయినా కనీసం 3,500 మంది పీజీ కోర్సుల్లో చేరేందుకు వీలుంటుంది. ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రభుత్వం పథకాన్ని వర్తింపజేసే అవకాశం ఉందని సమాచారం. ఈ మేరకు కొద్దిరోజుల్లో ప్రకటన వెలువడుతుందని చెబుతున్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

పద్మనాభం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుల్లో ఉన్న కుటుంబ సభ్యులు ఆధార్ అప్‌డేషన్ పూర్తి చేసుకొని ఈ-కేవైసీ చేయించుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఇప్పటికే ప్రతి రేషన్ షాపు డీలర్ల వద్ద ఈ-కేవైసీ చేయించుకోవాల్సిన లబ్ధిదారుల జాబితాను అందుబాటులో ఉంచారు. ఆ జాబితాలో తమ కుటుంబీకుల పేర్లు గుర్తించి ఈనెలాఖరులోగా డీలర్ల వద్ద గాని, మీసేవలో గాని, సచివాలయంలో గాని ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలి. ఈ-కేవైసీ చేసుకోని వారికి ప్రభుత్వ పథకాల లబ్ధి నిలిచిపోయే అవకాశం ఉందని అధికారులు చెప్పారు.

సంక్షేమ భవన్ వద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేయండి

» అధికారులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి వీరాంజనేయస్వామి ఆదేశం



సంక్షేమ భవన్ సందర్శిస్తున్న మంత్రి వీరాంజనేయస్వామి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ భవన్ వద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. ఎంవీపీ కాలనీలోని సంక్షేమ భవన్‌ను ఆయన గురువారం సందర్శించారు. కార్యాలయం పరిసరాలు ఆహ్లాదంగా ఉండేలా తీర్చిదిద్దాలని సూచించారు. సమావేశమందిరం, ఇతర విభాగాల కార్యాలయాలను పరిశీలించారు. భవన మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన సదుపాయాల గురించి డీడీ రామారావు వివరించారు. ఎమ్మెల్సీ చిరంజీవిరావు, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరకచెట్టు పోలమాంబ ఆలయంలో హుండీ లెక్కింపు

పెదవాల్తేరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరులో వెలసిన శ్రీ కరక చెట్టు పోలమాంబఅమ్మవారి దేవస్థానంలో గురువారం హుండీ లెక్కించారు. 20 రోజులకు గానూ హుండీ లెక్కింపు ద్వారా నగదు రూ.2,63,511 రూపాయలు వచ్చినట్టు దేవస్థానం ఈవో కె.గాయత్రి తెలిపారు. ఈ హుండీ లెక్కింపు దేవదాయ శాఖ పర్యవేక్షణ అధికారి పి.శేఖర్‌బాబు, పెదవాల్తేరు గ్రామ సంఘం సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, 3 టౌన్ పోలీసులు, శ్రీహరిసేవా సభ్యులు, సిబ్బంది తదితరులు హుండీ లెక్కింపు చేసినట్టు తెలిపారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా మంజుల

విశాఖపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల (స్వయంప్రతిపత్తి) ప్రిన్సిపాల్‌గా భీమునిపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మంజులను నియమించారు. ఏడాదిగా ఆమె భీమునిపట్నంలో పనిచేస్తూనే ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి. సురేఖను భీమునిపట్నం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

సినిమా గైడ్

● **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లలిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)

● **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, మోహిని (గాజువాక)

● **జాక్ :** రమాదేవి

● **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 18, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు)18, బెండకాయలు 24, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 32, బీరకాయలు 42, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 14, క్యారెట్ 28 దొండకాయలు 20, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది) 48, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 60, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 28, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడ దుంపలు 36, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనస పొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	104
లైవ్ ధర	124
విత్ స్కిన్	218
స్కిన్‌లెస్	228

శ్రుతిమించుతున్న గంజాయి బ్యాచ్ ఆగడాలు

» పాడుబడిన ఓ భవనం ఆవాసంగా ఆగడాలు
» వ్యూహం ప్రకారం గొడవలు సృష్టిస్తూ దుకాణదారులపై దాడులు
» పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితంలేదంటూ స్థానికుల ఆరోపణ

మద్దిలపాలెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గంజాయి మూకలకు మద్దిలపాలెం అడ్డాగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు పాడుబడిన ఇంటిని ఆవాసంగా చేసుకొని గంజాయిప్రియులు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారని స్థానికులు అంటున్నారు. వీరు చీకటి పడిన వెంటనే తమ ప్రతాపం చూపుతున్నారు. గంజాయి మత్తులో మునగి తేలుతూ సినీ ఫక్కీలో దోపిడీలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మద్దిలపాలెం జాతీయరహదారిపై ఉన్న లక్కీ వైన్స్ వెనుక శిథిలావస్థకు చేరిన భవనం ఒకటి ఉంది. ఆ భవనం ఎప్పటి నుంచో ఖాళీగా ఉండడంతో పదిహేను, ఇరవై మంది యువకులు ఆ ఇంటిలో అసాంఘిక కార్యకలపాలకు పాల్పడుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం నుంచే ఇక్కడకు యువకులు వస్తారు. అప్పటి నుంచి పాడుబడిన ఇంట్లో గంజాయి, మద్యం సేవిస్తారు. చీకటి పడ్డాక రోడ్డు



మత్తు ఇంజెక్షన్లకు వినియోగించే సిరంజీలు



తాగిపడేసిన మద్యం సీసాలు



గంజాయి బ్యాచ్ అడ్డాగా చేసుకున్న పాడుబడిన ఇల్లు ఇదే..

మీదకు చేరుకుంటారు. హైవే పక్కన ఉన్న చిరు దుకాణాల వద్దకు వెళ్తారు. ముందు వాళ్లలో వాళ్లే గొడవకు దిగుతున్నారు. దుకాణదారులు తమ వ్యాపారం పోతుందని వారిని వారించే లోపు దుకాణంలో వస్తువులు కొల్లగొట్టి పరారవుతున్నారు. టిఫిన్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చిరుతిళ్ల విక్రయ దుకాణాల వద్ద ఇలాంటి దాడులకు పూనుకుంటున్నారు. లేదా టిఫిన్లు చేసి బిల్లు ఇవ్వకుండా గొడవ పడి పారిపోతున్నారు. అంతేకాకుండా ఎవరైనా గొడవపడితే వీరంతా ఒకటై చితకబాదుతున్నారు. ముందుగా ఇద్దరు, ముగ్గురు దుకాణాల వద్దకు చేరుకొని హల్‌చల్ చేస్తారు. ఆకతాయిలను నిలదీస్తే నిమిషాల వ్యవధిలో పదిహేను ఇరవై మంది అక్కడకు చేరుకుంటారు. పెద్దగా కేకలు వేస్తూ రచ్చ చేస్తారు. దీంతో దుకాణదారులు, స్థానికులు బెదిరిపోతున్నారు. ఎందుకొచ్చిన గొడవ అని మిన్నకుండిపోతున్నారు. ఈ గంజాయి మూకలు అటుగా రాకపోకలు సాగించే మహిళల పట్ల కూడా అనుచితంగా ప్రవరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అయితే ఈ గంజాయి మూకలపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి గంజాయి మూకల నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

చకచకా రోడ్డు పనులు

ఆరిలోవ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాల నుంచి హనుమంతవాక జంక్షను వరకు చేపట్టిన పాత జాతీయ రహదారి పనులు చకచకా సాగుతున్నాయి. యంత్రాలతో పాత తారు రోడ్డుపై పొరను పూర్తిగా తీసివేసి దానిపై కొత్తగా రోడ్డు వేస్తున్నారు.

గత మూడు రోజుల నుంచి ఈ మార్గంలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఎప్పటి నుంచో గోతులమయంగా ఉన్న ఈ మార్గంలో మరమ్మతులు చేపడుతుండడం పట్ల వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మరమ్మతు చేసిన అనంతరం రోడ్డు

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించండి

» పాత వెంకోజీపాలెం జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయుల ఇంటింటి ప్రచారం



ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరుతూ జీవీఎంపీ పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ప్రచారం

వెంకోజీపాలెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదుల మౌలిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో డిజిటల్, తరగతి గదుల బోధన ఉంటుందని 15వ పాత వెంకోజీపాలెంలోని జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి అన్నారు. కార్పొరేట్ పాఠశాలలు వద్దు... ప్రభుత్వ పాఠశాలలు ముద్దు అంటూ పాత వెంకోజీపాలెం గ్రామంలోని ఇంటింటికి గురువారం పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ రెసిడెన్సియల్, నవోదయ వంటి పోటీ పరీక్షలకు సిద్ధం చేసి, సీట్లను సాధించడం, జంక్‌ఫుడ్ రహిత పాఠశాలల నిర్వహణ, క్షేత్ర పర్యటనలు, విహారయాత్రలకు విద్యార్థులను ఉపాధ్యాయులు తీసుకువెళ్లడం, పాఠశాలలో ఘనంగా జాతీయ పండుగలు, పాఠశాల వార్షికోత్సవాలు, వివిధ పండుగల, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా చిన్నారుల్లో అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. భాషా, గణిత, సైన్స్ దినోత్సవాలు చేపట్టడం తమ పాఠశాల ప్రత్యేకతని వివరించారు. రెండు సంవత్సరాలు పూర్తయిన విద్యార్థులకు బాల్యం పేరిట తమ పాఠశాలలో చేర్చుకుంటామని తెలిపారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో రూ.వేలకు వేల రూపాయల ఫీజులు చెల్లించి విద్యను నేర్పించడం కన్నా ఉచితంగా అదే ప్రమాణాలను నాణ్యమైన విద్యను తమ పాఠశాలలోనూ అందిస్తున్నామని సూచించారు. అంతేకాకుండా వంద శాతం ఇంగ్లీషు మీడియం, తల్లికి వందనం పథకం వర్తింపు, ప్రతి రోజు నాణ్యమైన భోజనం, 3 జతల యూనిఫాం, ప్రతి రోజూ యోగా, వ్యాయామం, ఆటలు, పాఠశాలలోనే స్వచ్ఛమైన ప్యూరిఫైడ్ తాగునీరు సదుపాయం, పూర్తిగా విద్యుద్దీకరించిన ఆర్‌సీసీ బిల్డింగ్, ప్రతీ ఏడాది ఉచితంగా ఐరన్, ఫోలిక్ మాత్రలు, అల్బెండజోల్ మాత్రల పంపిణీ వంటి కార్యక్రమాలను ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్నారని చిన్నారుల తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

» ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



వాల్తేరు డిపో వద్ద ప్లకార్డులు పట్టుకొని ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

పెదవాల్తేరు. ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం వాల్తేరు డిపో వద్ద ఆర్టీసీ ఉద్యోగులు ప కార్డులతో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వాల్తేరు డిపో ఎన్ఎంయూ డిపో ఛైర్మన్ బి.రవి పాల్గొని మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, త్వరలో రాబోయే ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ ఉద్యోగుల ద్వారా నడపాలని, ఈహెచ్ఎస్ ద్వారా కాకుండా ఉద్యోగులకు పాత విధానంలో వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. నైట్ అవుట్ అలవెన్స్‌లను రూ.150 నుంచి రూ.400కు పెంచాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు అడిగిన వెంటనే చైల్డ్ కేర్ లీవ్ ఏర్పాటు చేయాలని కోరారు. నాన్-ఆపరేషన్ ఉద్యోగులు, గ్యారేజ్ ఉద్యోగులు, సమస్యలు పరిష్కారించాలని కోరారు. అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సంస్థ ద్వారా మాత్రమే జీతాలు చెల్లించాలని, ఆన్ కాల్డ్ డ్రైవర్లకు రోజువారి వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో వాల్తేరు డిపో కార్యదర్శి ఆర్ వసంతరావు, గ్యారేజ్ అధ్యక్షులు కొండలరావు, ఆధిక సంఖ్యలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

కొట్లాట కేసులో ఇరు వర్గాలపై కేసు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పెదజాలారిపేటలో ఈ నెల 15న రెండు వర్గాల మధ్య జరిగిన గొడవకు సంబంధించి ఎంవీపీ పోలీసులు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు. ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. పెదజాలారిపేటలో రామోలు రాధ, రమేష్ దంపతులు నివాసం ఉంటున్నారు. ఈ నెల 15 రాత్రి పన్నెండున్నర సమయంలో రమేష్ మద్యం మత్తులో వచ్చి భార్య రాధను కొట్టాడు. ఆ సమయంలో స్థానికంగా ఉంటున్న సతీష్, పెద్దయ్య, పోలయ్య ఈ సంఘటన చూసి నవ్వుతుండడంతో రాధ, రమేష్‌లకు కాబోయే అల్లుడు సురేష్ ఆ ముగ్గురిని ఎందుకు నవ్వుతున్నారు, వెళ్లిపోండంటూ కోరాడు. ఈ ముగ్గురితో పాటు వారి బంధువులు పైడిరాజు, వెంకటలక్ష్మి, శ్రీను, సత్తయ్య, నల్లబాబు, సతీష్, ముక్కుడు అప్పన్న మనవడు తదితరులు కర్రలతోనూ, బీరు సీసాతోనూ దాడిచేసి, సతీశ్‌ను అతడి కుటుంబ సభ్యులను గాయపరిచారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా ఫిర్యాదులోని నిందితుడైన తెడ్డు సతీష్ కూడా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రాధ, రమేష్, వారి కుమారుడు పృథ్వీ, సురేష్, వారి బంధువులు వెంకటలక్ష్మి, శ్రీను, దుర్గ, సంధ్య తమ్మై దాడి చేసి, నల్లబాబు ఇంట్లోకి వెళ్లి, బీరువా పగుల గొట్టి, రూ. 1.30 లక్షలు దొంగలించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐమురళీపర్యవేక్షణలో కేసుదర్యాప్తుచేస్తున్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అప్పుఘర్ ప్రాంతానికి చెందిన పదహారేళ్ల బాలిక అదృశ్యమయింది. తండ్రితో కలిసి పనిచేస్తున్న ఓ యువకుడు ఆమెను ప్రేమిస్తున్నట్టు ఫోన్‌కు మెసేజ్‌లు పంపుతుండడంతో తండ్రి ప్రశ్నించాడు. దీంతో ఈనెల 17న బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. హెచ్‌సీ రాంబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంపత్ వినాయగర్ దేవాలయం హుండీ లెక్కింపు

» 21 రోజులకు రూ.16,45,917 ఆదాయం

సిరిపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : శ్రీ సంపత్ వినాయగర్ దేవాలయం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. గడిచిన 21 రోజులకు రూ.16,45,917 నగదు లభించినట్టు ఆలయ ఈవో కే.శిరీష్, ఫ్యామిలీ ఫౌండర్ మెంబర్ టి.ఆర్.చోళన్ తెలిపారు. గురువారం దేవాలయ ఆవరణలో నిర్వహించిన హుండీ లెక్కింపులో బంగారం 2-977 మిల్లీ గ్రాములు, వెండి 098 గ్రాముల 900 మిల్లీ గ్రాములు, ఒమన్ రియల్ 40, మలేషియా రింగ్గిట్ 1, కతర్ రియల్ 1, రూ.111 చెక్ రూపంలో వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో శ్రీవెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారులుగా బి.ప్రసాద్ దేవాలయ సిబ్బంది జి.గోవింద రెడ్డి, డి.ఎస్.ప్రసాద్, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారన్నారు.



హుండీ ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈవో శిరీష

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

» టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ

మద్దిలపాలెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పేదల లబ్ధి కోసం అమలు చేస్తున్న పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ పిలుపునిచ్చారు. స్థానిక 22వ వార్డులో గురువారం నిర్వహించిన టీడీపీ వార్డు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నడు లేని విధంగా పేదలు, మహిళలు, కులాలు, యువతకు ఆసరగా నిలిచే వినూత్న పథకాలను ప్రభుత్వం ప్రవేశపెడుతోందన్నారు. ఆయా పథకాలపై ప్రజల్లో ప్రచారం చేసి పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తకు ఉందన్నారు. అలాగేముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ జన్మదినోత్సవాలను ఘనంగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, పడాల డేవిడ్, కోడిబోయిన ఆనంద్, రాజ్‌కుమార్, బర్ల రాజు, అప్పారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

» వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్



ఎంవీపీ సెంట్రల్ నర్సరీలో పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ విశ్వనాథన్

సిరిపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఎంవీపీ సెంట్రల్ నర్సరీలో సుమారు రూ.93 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టరును ఆదేశించారు. తదుపరి ఎన్ఏడీ ఫ్లై ఓవర్ వద్ద నిర్మిస్తున్న రైల్ ఓవర్ బ్రిడ్జ్ పనులను పరిశీలించి, ఈ పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్, ఇంజనీర్‌లు బలరామరాజు, మధుసూదనరావు, డీఎఫ్‌వో సుజాతశివానీ, సహాయ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస-పాడువ రైల్వే లైన్‌లో తనిఖీలు



వంతెన వద్ద ట్రాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

విశాఖపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఇంట్రా జోనల్ సేఫ్టీ ఆడిట్‌లో భాగంగా వాల్తేరు డివిజన్ అధికారులు కొత్తవలస - పాడువ మార్గంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ అరుణ్ జె. రాథోడ్ బృందం మేజర్ స్టేషన్లు, లెవెల్ క్రాసింగ్‌లు, యార్డులను తనిఖీలు చేసింది. ఈ కార్యక్రమంలో చీఫ్ ట్రాక్ ఇంజనీర్ డీకే మాలిక్, చీఫ్ పాసింజర్ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజర్ కె.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి, ఖాళీ జాగా పన్నుల చెల్లింపునకు 30 వరకు గడువు

» జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

వెంకోజీపాలెం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలోని గృహ యజమానులు, ఆస్తి పన్ను చెల్లింపుదారులకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ జాగా పన్నుల వడ్డీపై 50 శాతం రాయితీ 2025, మార్చి 31తో ముగిసింది. అయితే ఆ నెలలో ప్రభుత్వ సెలవులు అధికంగా ఉన్నందున చాలా మంది తమ ఆస్తి పన్నుల చెల్లింపులను వినియోగించుకోలేనందున అలాంటి వారి కోసం మరొక అవకాశాన్ని కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నులపై 50 శాతం వడ్డీ రాయితీని ఈ నెల 30 వరకు చెల్లించేందుకు గడువు పొడిగించిందని, ఈ సదవకాశాన్ని పన్నుదారులు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇంచార్జి కమిషనర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 2025, ఏప్రిల్ 1 నుంచి 2026, మార్చి 31 వరకు ఆస్తి, ఖాళీ జాగా పన్నులు ఏక మొత్తంలో ఈ నెల 30వ తేదీ లోగా చెల్లిస్తే ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీని ప్రభుత్వం కల్పించిందన్నారు. కాబట్టి గృహ, ఆస్తి పన్ను చెల్లింపు దారులు ప్రభుత్వం కల్పించిన ఈ సదవకాశాన్ని కూడా వినియోగించుకోవాలని జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ప్రకటనలో పేర్కొన్నారు. నగర ప్రజల సౌకర్యార్థం ప్రతి వార్డు సచివాలయ పరిధిలోని ఇంటి యజమానులు వారి గృహం వద్దకు వచ్చే సచివాలయం కార్యదర్శిని సంప్రదించి ఆస్తి పన్ను బకాయిలను డెబిట్, క్రెడిట్ కార్డు, యూపీఐ ద్వారా చెల్లించవచ్చని లేదా జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, అన్ని జోనల్ కార్యాలయాల సౌకర్యం కేంద్రాలలో గాని, ఐడీబీఐ సిరిపురం, ఐసీఐసీఐ ద్వారకానగర్, పంజాబ్ నేషనల్ బ్యాంకు మధురవాడ, యాక్సిస్ బ్యాంకు రామ్‌నగర్ బ్రాంచిలలో చెల్లించవచ్చునని కమిషనర్ సూచించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళల అదృశ్యం

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భార్య కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు అందింది. హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు వెంకోజీపాలెంలోని చింతాడ స్వామిసాయి, భార్య సావిత్రి (26) ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. ఈ నెల 13న భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. భార్యపై చెయ్యి చేసుకున్నాడు. మరుసటి రోజు ఉదయం భార్య కనిపించలేదు. వివిధ ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఒకటో సెక్టారులో మరో వివాహిత

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ ఒకటో సెక్టారులో ఉంటున్న దన్నన వంశీ తన తల్లి కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తల్లి సుధ, మామ చంటి, వంశీ కలిసి నివసిస్తున్నారు. వంశీ కొద్ది రోజులు తన సోదరి ఇంట్లో ఉండి, ఈనెల 15న తిరిగి ఇంటికి వచ్చాడు. ఇంట్లో తల్లి కనిపించకపోవడంతో మామ చంటిని ప్రశ్నిస్తే ఈ నెల 13 నుంచి సుధ (38) కనిపించడం లేదని తెలిపాడు. తల్లి పనిచేస్తున్న యజమాని ఇంటికి వెళ్లి, వంశీ ఆరా తీయగా, 13 నుంచి పనిలోకి రావడం లేదనితెలిపాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మేయర్‌కు అప్పుడు కన్నీరు రాలేదా?

» జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్లు మూర్తియాదవ్, గంధం శ్రీనివాసరావు

విశాఖపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): 'యాదవ సామాజికవర్గానికి చెందిన తనను మేయర్ పీఠం నుంచి దింపడానికి తన సామాజికవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులే కుట్ర చేస్తున్నారని గొలగాని హరి వెంకటకుమారి మొసలికన్నీరు కార్చుతున్నారని జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్‌అన్నారు. వైసీపీ హయాంలో తన సామాజికవర్గం కార్పొరేటర్లకు అన్యాయం జరిగితే కన్నీరురాలేదా?' అని ప్రశ్నించారు. జీవీఎంసీలోని టీడీపీ ఫ్లోర్‌లీడర్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. వంశీకృష్ణ శ్రీనివాస్ కార్పొరేటర్‌గా21వ వార్డులో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కౌన్సిల్‌లో కోరితే మేయర్ పట్టించుకోలేదన్నారు.యాదవ కార్పొరేటర్లు తమ వార్డులో అభివృద్ధి పనులు జరగడం లేదని, నిధులడిగితే సామాజికవర్గం గుర్తుకురాలేదా? అని ప్రశ్నించారు. మేయర్‌గా నాలుగేళ్లు పనిచేసిన హరివెంకటకుమారికి ఇంతవరకు ఫోన్ లేదన్నారు. షాడోమేయర్ అవినీతి నేపథ్యంలోనే అవిశ్వాసం పెట్టాల్సి వచ్చిందన్నారు. కోడివ్యర్థాల పంచాయితీ మేయర్ ఇంట్లోనే జరిగిందన్నారు. మేయర్, డిప్యూటీ మేయర్, వైసీపీ ఫ్లోర్‌లీడర్ ప్రతినెలా మామూళ్లు తీసుకుంటున్నారన్నారు. డిప్యూటీ మేయర్ శ్రీధర్ ఆనందపురం మండలం గిడిజాలలో ఐదెకరాల భూమిని ఆక్రమించారన్నారు. వైసీపీ నేతలు విప్ జారీచేస్తున్నామని వైసీపీ కార్పొరేటర్లను బెదిరిస్తున్నారని, వారికి దానిపై అవగాహనలేదన్నారు.టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాక వైసీపీ సమన్వయకర్తగా యాదవసామాజికవర్గానికి చెందిన వ్యక్తిని నియమిస్తే, అతన్ని తొలగించి అమర్‌నాథ్ టికెట్ లాక్కుంటే మేయర్ ఏం చేశారని ప్రశ్నించారు.

22న సీనియర్ సిటిజన్ల కలయిక

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 22న 'మీట్ గ్రేట్ ట్రీట్' పేరుతో సీనియర్ సిటిజన్స్ కలయిక కార్యక్రమాన్ని కన్సర్న్ చారిటబుల్ ట్రస్ట్, వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు డా.కె.రమాప్రభ, పీకే జోస్ తెలిపారు. వారు పోస్టర్‌ను విడుదల చేశారు.

తవ్విన చోటే తవ్వడం.. చేసిన పనే చేయడం!

» ముందుకు సాగని యూజీడీ పనులు
» కొరవడిన అధికారుల పర్యవేక్షణ
» పట్టించుకోని ప్రజాప్రతినిధులు
» స్థానికులకు తప్పని అవస్థలు



తవ్వకాలతో పాడైన కళింగనగర్ వుడాక్వార్టర్సు రోడ్డు



వుడా కాలనీ చివర సిద్దార్థ పార్కు రోడ్డు పరిస్థితి ఇదీ..

మురళీనగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని మురళీనగర్, ఎన్జీజీవోస్ కాలనీ, మాధవధార ప్రాంతాల్లో యూజీడీ పనులు ఏళ్లుగా కొలిక్కిరావడం లేదు. పదేపదే చేసిన పనులే చేయడం, తవ్విన చోటే తవ్వడంతోనే సరిపోతోందంటూ అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. దీనివల్ల ఇటుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు, స్థానికులకు ఇబ్బందిగా మారుతోంది.

గ్రేటర్ విశాఖ 51వ వార్డు మాధవధార వుడా క్వార్టర్స్ ఏరియాలో యూజీడీ మ్యాన్‌హోల్ పైపుల అనుసంధానం కోసం రోడ్లను తవ్వేసి, పనులు ముగిసినా పూడ్చకుండా అలాగే వదిలేస్తున్నారు. దీంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. వుడా కాలనీ విద్యుత్ కార్యాలయం వెనుక ఎస్టీ హాస్టల్ రోడ్డులోనూ ఇదే పరిస్థితి. ఎర్రమట్టి దిబ్బలుగా మారిన సిద్ధార్థ పార్క్ రోడ్డులో రోజూ విద్యార్థులు రాళ్ల బాటపైనే రాకపోకలు సాగిస్తున్నారు. వార్డు యూజీడీ కాంట్రాక్టరు నిర్లక్ష్యం, జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా క్షేత్ర స్థాయిలో పనులపై పర్యవేక్షణ కొరవడింది. ఎపుడు కావాలంటే అపుడు పనులు చేసే వెసులుబాటు సదరు కాంట్రాక్టరుకు ఉండటంతో ఈ వార్డుల్లో పదే పదే తవ్వకాలు, మళ్లీ మళ్లీ బిల్లుల మంజూరు, నిర్వహణ పేరుతో ప్రజాధనం లూటీ అవుతోందన్న ఆరోపణలుఉన్నాయి. జీవీఎంసీ ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ సారించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

జనసేనలోకి శివగణేష్

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ జిల్లా మాజీ యువజన విభాగ అధ్యక్షుడు, ఏపీఐఐసీ రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఆళ్ల శివగణేష్ జనసేన పార్టీలో చేరారు. జనసేన విశాఖ జిల్లా అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విజయవాడ మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ సమక్షంలో చేరినట్టు శివగణేష్ తెలిపారు. ఈ మేరకు ఆయనకు మంత్రి మనోహర్ కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీహరిప్రసాద్, పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త అంగ ప్రశాంతి, బెహరా భాస్కరరావు, తిప్పల వంశీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శివగణేశ్‌కు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి మనోహర్, పక్కన దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

వైభవంగా ముత్యమాంబ ప్రధాన పండుగ

కంచరపాలెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కంచరపాలెం మెట్టు వద్ద కొలువైయున్న ముత్యమాంబ అమ్మవారి ప్రధాన పండుగను గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేక అలంకరణ చేశారు. వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.కంచరపాలెం పరిసరాలు, ఇతర ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు విచ్చేశారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు దంపతులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులు అమ్మవారి ఘటాలుతో పసుపు కుంకుమల సమర్పించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద కళా ప్రదర్శనలు అలరించాయి.

'నమో భారతాంబ' పుస్తకావిష్కరణ

సీతంపేట, ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో పరవస్తు పద్యపీఠం ఆధ్వర్యంలో భారదేశ వాయుసేన మాజీ ఉద్యోగి, బ్యాంక్ ఉద్యోగుల సంఘం నాయకుడు నాగుల శ్రీనివాసరావు రాసిన నమో భారతాంబ ఖండ కావ్యం ఆవిష్కరణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గురు సహస్రావధాని డాక్టర్ కడిమిళ్ల వరప్రసాద్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచయిత శ్రీనివాసరావు రాసిన సీసపద్యాలు సరళంగా శుద్ధంగా వైవిధ్య అంశాలతో ఉన్నాయని కొనియాడారు. పరవస్తు పద్య పీఠాధిపతి పరవస్తు ఫణిశయన సూరి స్వాగతోపాన్యాసం చేశారు. అమరావతి విశ్వసాహితి ప్రధాన కార్యదర్శి సీహెచ్ చిన సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డీవీ సూర్యారావు పుస్తక సమీక్ష చేశారు. పుస్తక రచయిత నాగుల శ్రీనివాసరావు తన స్పందనను తెలిపారు. కార్యక్రమంలో భారతీయ స్టేట్ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కుష్బు, ఎస్‌బిబిఐ స్టాఫ్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆచంట సుష్మ, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గురుసహస్రావధాని డాక్టర్ కడిమిళ్ళ వరప్రసాద్, ఆచార్య డీవీ సూర్యారావు, సీహెచ్ చిన సూర్యనారాయణ తదితరులు

వాట్సాప్ గవర్నెన్స్ పోస్టర్ ఆవిష్కరణ

మహారాణిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అందుబాటులోకి తీసుకువచ్చిన 9552300009 వాట్సాప్ నెంబరు ద్వారా అన్ని రకాల ప్రభుత్వ సేవలను సులభంగా పొందవచ్చని ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. గురువారం వారు కలెక్టరేట్‌లో వాట్సాప్ గవర్నెన్స్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలు సులభరీతిలో సేవలను పొందవచ్చునని చెప్పారు. హాయ్ అని మెసేజ్ చేయడం ద్వారా తమకు కావాల్సిన సేవలను ఎంపిక చేసుకోవచ్చునని చెప్పారు.

తాగునీటి సమస్య లేకుండా చూడండి

మహారాణిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. గురువారం ఆయన అమరావతిలోని సచివాలయం నుంచి కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడా తాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

మహారాణిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖాధికారులు సూచించారు. గురువారం చైతన్య పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రమాదాలు జరిగేటప్పుడు నివారణ చర్యలపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

మే 20న దేశవ్యాప్తంగా సమ్మె

మహారాణిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కేంద్ర కార్మిక సంఘాలు మే 20వ తేదీన సమ్మెకు పిలుపునిచ్చినట్టు ఆయా సంఘాల నాయకులు తెలిపారు. గురువారం వారు నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మిక చట్టాలను కాలరాస్తుందన్నారు. బ్రిటీష్ హయాంలోనే పోరాడి సాధించుకున్న 44 చట్టాల్లో 29 చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్పు చేయడం దారుణమన్నారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

తగరపువలస, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు జీరుపేటకు చెందిన బైరెడ్ల రామకృష్ణ (36) రెండు రోజులుగా కనిపించడం లేదని అతని కుటుంబ సభ్యులు భీమిలి పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు.అతను కొంతకాలంగా మానసికంగా ఇబ్బంది పడుతున్నాడని,బుధవారం ఇంటి నుంచి వెళ్లిపోయారని చెప్పారు. యువకుడి తండ్రి నారాయణమూర్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

శ్రీప్రకాష్‌లో పురావస్తు సామగ్రి ప్రదర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రముఖ చిత్రకారుడు రమేశ్

సీతమ్మధార, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా శ్రీప్రకాష్ విద్యానికేతన్ పాఠశాలలో సృజన ఇంటాక్ క్లబ్ ఆధ్వర్యంలో పురావస్తు ప్రదర్శన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ ప్రదర్శనలో 1915 నుంచి 1980 మధ్య ఉపయోగించిన పురాతన వస్తువులు, ఫొటోల అల్బమ్స్, పట్టు చీరలు, అలంకార వుస్తువులు, 100 సంవత్సరాల కాలం నాటి పెండలం గోడ గడియారాలు ప్రదర్శించారు.ఎర్ర చందనపు చెక్క బొమ్మలు, లక్క పిడతలు, ఆనాటి చేద, గాలం, ఇత్తడి, కంచు, రాగి పాత్రలు, 60 సంవత్సరాల క్రితం నాటి రేడియోలు, కెమెరాలు మొదలైనవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బ్రిటీష్ కాలంనాటి కరెన్సీ నాణేలు, అప్పటి పోలీస్ మెడల్, 50 ఏళ్ల కాలంనాటి బాకులు, తాసు, స్త్రీల అలంకరణ సామగ్రిని భద్రపరచుకునే పేటికలు సందర్శకులకు ఎంతగానో ఆకర్షించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ చిత్రకారులు, ప్రొఫెసర్ రమేష్ మాట్లాడుతూ పురావస్తు సేకరణ ప్రదర్శన ఎంతో అద్భుతంగా ఉందని ప్రశంసించారు. శ్రీప్రకాష్ విద్యానికేతన్ కేవలం చదువుకు మాత్రమే కాకుండా భారతీయ వారసత్వ సంపదను సంస్కృతీ సంప్రదాయాలను అనుసరిస్తూ జరిపే ఇటువంటి ప్రదర్శనలు నిజంగా అభినందించదగినవన్నారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత చిట్టూరి వాసుప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కృతీ సంప్రదాయాలను తెలియజేసే ఈ ప్రదర్శన ఎంతో విజ్ఞాదాయకంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు.

నవజాత శిశు విభాగానికి వైద్య పరికరాలు వితరణ

మహారాణిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లోని నవజాత శిశువు విభాగానికి ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్ సంస్థ రూ. 4 లక్షల విలువ చేసే వైద్య పరికరాలను వితరణగా అందజేసింది. ఈమేరకు ఆ సంస్థ తరపున ఏఎంసీ పూర్వ విద్యార్థి డాక్టర్ సతీశ్ వైద్య పరికరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్‌కు గురువారం అందించారు. ఈ సందర్భంగా శివానంద్ మాట్లాడుతూ ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్ ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ. 9 లక్షల విలువ చేసే పరికరాలను అందించిందని చెప్పారు.

గత తప్పిదాలపై చర్యలు ఏవీ ?

సింహాచలం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామికి గతంలో జరిగిన చందనోత్సవాల్లో అనేక తప్పిదాలు జరిగాయి. వాటిపై అధికారులు ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. 2021లో జరిగిన చందనోత్సవం కరోనా వల్ల ఏకాంత సేవగా నిర్వహించారు. అప్పుడు దేవస్థానం సిబ్బందిని కూడా దర్శనానికి అనుమతించలేదు. అంతటి కట్టుదిట్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ నలభై మంది రహస్యంగా నిజరూప దర్శనం చేసుకున్నట్టు విమర్శలు వచ్చాయి. దేవస్థానంతో ఎటువంటి సంబంధం లేని వ్యక్తి స్వామివారి నిజరూప దర్శనం చేసుకున్న వీడియో కూడా సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. అలాగే అంతరాలయంలోని మూల విరాట్‌ను ఫొటో తీసి వైరల్ చేశారు. ఈ ఘోర తప్పిదాలపై దేవదాయ శాఖ అధికారులు విచారణ చేపడతామని ప్రకటించారు తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదు.



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

అనాటమీ విభాగంలో వేడుకలు

మహారాణిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్ అనాటమీ విభాగంలో అనాస్కెచ్ 2.0 పేరుతో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు ఆ విభాగానికి సంబంధించి పాఠ్యాంశాలుగా ఉన్న శరీర భాగాలను పెయింట్స్ ద్వారా ప్రదర్శించారు. ఈ ప్రదర్శన సభికులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, వైద్యులు కృష్ణవేణి, రవీంద్ర కిశోర్, రాధిక, గీతాంజలి, భవానీ, వాసంతి, సురేఖ, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు చట్టాన్ని వ్యతిరేకిస్తున్నా..

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ప్రజాస్వామ్యం అరుంధతీ నక్షత్రంలా తయారైందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు.బీజేపీ ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు చట్టాన్ని తాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానని చెప్పారు. గురువారం ఆయన డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మాజీ ప్రధాని వాజ్‌పేయ్, అద్వానీ చేయని చట్టం హఠాత్తుగా చేయాల్సిన అవసరం మోదీ ప్రభుత్వానికి ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. సుప్రీంకోర్టులో వక్ఫ్ బోర్డు ఆస్తులపై వాదనలు విన్న తరువాత భారత రాజ్యాంగం అంటే ఏమిటో కేంద్ర ప్రభుత్వానికి తెలియదనిపించిందన్నారు. తుషార్ మెహతా వాదనలు తుస్ అని ఎగిరిపోయాయని, ముస్లింల భూములతో బీజేపీకి ఏం పని అన్నారు. పార్లమెంట్ కమిటీ తెచ్చిన బిల్లు కాదని, జగదాంబిక పాల్ అనే ఒకాయన తెచ్చిన బిల్లు ఇదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో తిరిగి రాగానే పూర్వపు వక్ఫ్ బోర్డు చట్టాన్ని తీసుకొస్తామని తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఇస్తున్నట్టు 24 శాతం ఎస్సీ, ఎస్టీలకు, 15 శాతం ఓబీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.



గెడ్డల్లో పూడిక తీత పనులు



గెడ్డలో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

మాధవధార, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సమస్యాత్మక గెడ్డ ప్రాంతాల్లో పూడిక తొలగింపునకు జీవీఎంసీ చర్యలు చేపట్టింది. వచ్చే వానాకాలం దృష్ట్యా పేరుకుపోయిన వ్యర్థాల్ని తొలగించి, వరద ముంపు సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మాధవధార వుడా కాలనీ ఎగువ ప్రాంతం నుంచి పారే గెడ్డల్లో ఇపుడు పూడికతీత పనులు ఆరంభించారు. దిగువ హైవే సమీప రామన్నకాలనీ, చిట్టిబాబు కాలనీ, అంబేడ్కర్ కాలనీల్లో ఏటా వాననీటి ముంపు సమస్య ఎదురవుతోంది. ఈ అనుభవాల నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపడుతున్నారు. కాగా, జీవీఎంసీ 50వ వార్డు సాయిరామ్‌నగర్ దిగువ ప్రాంతాలు, 49వ వార్డు పాలిటెక్నిక్ కళాశాల దిగువ మాణిక్యాంబ కాలనీల మధ్యగా పారే గెడ్డల వద్ద అధికారులు వ్యర్థాల తొలగింపు పనులు చేపట్టాలని స్థానిక నివాసితులు కోరుతున్నారు.

మహా పక్షపాతం

... 5వ పేజీ తరువాయి

ఖర్చు చేశారు.

మిగిలిన కార్పొరేటర్లు గగ్గోలు

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం జరిగిన ప్రతిసారీ పలువురు కార్పొరేటర్లు తమ వార్డుల్లో అభివృద్ధి పనులు జరగడం లేదంటూ గగ్గోలు పెట్టేవారు. మేయర్, డిప్యూటీమేయర్లు, ఫ్లోర్ లీడర్‌తోపాటు మరికొందరి వార్డులకే భారీగా నిధులు మంజూరుచేస్తున్నారంటూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కార్పొరేటర్లతో పాటు వైసీపీ సభ్యులు కూడా ఆగ్రహం వ్యక్తం చేసేవారు. దీనిపై వివరణ ఇవ్వడానికి అధికారులు కూడా నీళ్లు నమిలేవారు. రాజకీయ స్వలాభంతో పాటు కాంట్రాక్టర్ల నుంచి పర్సంటేజీల వస్తాయనే భావనతోనే తమ తమ వార్డులకు ఎక్కువ నిధులు మంజూరు చేయించుకున్నారని కార్పొరేటర్లు విమర్శలు గుప్పించినా ఆ నలుగురు మాత్రం మౌనం వహిస్తూ వచ్చారు.

పీజీకి ఫీజు రీయింబర్స్‌మెంట్

... 5వ పేజీ తరువాయి

సుమారు 50కు పైగా ప్రైవేటు పీజీ కాలేజీలు ఉన్నాయి. గతంలో ప్రైవేటు కాలేజీల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం పథకాన్ని వర్తింపచేసింది. వైసీపీ ప్రభుత్వం ప్రైవేటు కాలేజీల్లో పీజీ కోర్సులు చేసే విద్యార్థులకు పథకాన్ని నిలిపేసింది. దీంతో ఆర్థికంగా మెరుగైన విద్యార్థులు మాత్రమే ప్రైవేటు కాలేజీల్లో చేరారు. గత ప్రభుత్వ నిర్ణయంతో అనేక పీజీ కాలేజీల్లో సీట్లు మిగిలిపోయాయి. కూటమి ప్రభుత్వం మళ్లీ పథకాన్ని వర్తించేలా చర్యలు తీసుకోవడంతో విద్యార్థులతోపాటు పీజీ కాలేజీ యాజమాన్యాలు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

ఏయూ పరిధిలోని ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లోని కాలేజీల్లో సుమారు ఐదు వేల మంది విద్యార్థులకు పీజీ చేసే అవకాశం లభించనుంది. మేనేజ్‌మెంట్ కోటా సీట్లు పోయినా కనీసం 3,500 మంది పీజీ కోర్సుల్లో చేరేందుకు వీలుంటుంది. ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రభుత్వం పథకాన్ని వర్తింపజేసే అవకాశం ఉందని సమాచారం. ఈ మేరకు కొద్దిరోజుల్లో ప్రకటన వెలువడుతుందని చెబుతున్నారు.

కౌన్సిల్‌లోకి సభ్యులకు మాత్రమే అనుమతి

... 5వ పేజీ తరువాయి

బాధ్యత రో అధికారులదేనని కలెక్టర్ వివరించారు. ఒక్కో రో అధికారి తమకు కేటాయించిన వరుసలో ఎంతమంది చేతులు ఎత్తారనేది పేర్లతో సహా నమోదుచేసుకుని, కార్యదర్శికి అందజేయాల్సి ఉంటుందని కలెక్టర్ వివరించారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలతో పాటు అదనంగా మరికొన్ని వీడియో కెమెరాలను కూడా ఏర్పాటుచేయాలని ఆదేశించారు. సమావేశం ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీయించాలని కలెక్టర్ ఆదేశించారు.

పటిష్ఠ భద్రత

కౌన్సిల్ సమావేశానికి పోలీసులు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేస్తున్నారు. 19వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకోనున్నారు. జీవీఎంసీ ఉద్యోగులు, వార్డు కార్పొరేటర్లు, ఎక్స్‌అఫీషియో సభ్యులను మినహా మిగిలిన వారు లోపలకు ప్రవేశించకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న సీఎంఆర్ బస్టాప్ నుంచి సంపత్ వినాయగర్ ఆలయానికి వెళ్లే రోడ్డు మినహా జీవీఎంసీ కార్యాలయం చుట్టూ ఉన్న రోడ్లను బారికేడ్లతో మూసివేయనున్నారు. ఆ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 210 మంది శాంతిభద్రతల విభాగం సిబ్బంది, 90 మంది ట్రాఫిక్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేయాలని పోలీస్ అధికారులు నిర్ణయించారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల వెల్లువ

... 5వ పేజీ తరువాయి

చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలను ఇప్పటికే పూర్తిచేశారు. కానీ ఆయా వార్డులు/గ్రామాలకు కేటాయించిన యూనిట్ల జాబితాను అనేకచోట్ల ఫైనల్ చేయలేదు. అధికసంఖ్యలో దరఖాస్తులు రావడం, వారంతా నేతల చుట్టూ ప్రదక్షిణలు చేయడమే దీనికి కారణమని తెలుస్తోంది. కొన్నిచోట్ల నాయకులు ఫైనల్ జాబితాను అధికారులకు పంపారు. రుణాలకు ఎంపికైన వారితో జూన్ ఆరో తేదీ నాటికి యూనిట్లను గ్రౌండింగ్ చేయించాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు ప్రక్రియను వేగవంతం చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. అయితే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొలిక్కి రాకపోవడం సమస్యగా మారిందంటున్నారు.

విల్లింగ్‌కు బ్యాంకులు నో..

వివిధ ఉపాధి యూనిట్లకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ అందిస్తుండగా, 50 శాతం బ్యాంకు రుణంగా ఇస్తుంది. కానీ కొన్నిచోట్ల బ్యాంకులు రుణాలు అందించేందుకు ముందుకురావడం లేదని తెలుస్తోంది. పాత రుణాలున్న వారికి, క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉన్నవారికి రుణాలివ్వలేమని బ్యాంకు అధికారులు తేల్చి చెబుతున్నారు. యువత, రైతులు గతంలో బ్యాంకుల నుంచి తీసుకున్న వ్యవసాయ రుణాలు మాఫీ అవుతాయన్న ఆశతో చెల్లించలేదు.దీంతో క్రెడిట్ స్కోర్ తగ్గిపోయింది. ఇది తాజా సబ్సిడీ రుణాల మంజూరుకు అవరోధంగా మారిందంటున్నారు.

అభివృద్ధిలో ముందుండాలి

... 5వ పేజీ తరువాయి

సందర్భంగా జిల్లాలో అమలవుతున్న పథకాల వివరాలను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ వివరించారు.

నగరంలో తవ్విన రోడ్లు వెంటనే పూడ్చండి

వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం నగరంలో తవ్విన రోడ్లను వెంటనే పూడ్చాలని ఎంపీ శ్రీభరత్ ఆదేశించారు. భూగర్భ విద్యుత్ లైన్లు, తాగునీటి పైపులైన్లు, యూజీడీ ఏర్పాటుకు పలుచోట్ల రోడ్లను తవ్వేస్తున్నారని, వాటి వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేలు గణబాబు, పంచకర్ల రమేష్‌బాబు ప్రస్తావించడంతో ఎంపీ స్పందించారు. నిర్దేశించిన పనులు పూర్తయిన వెంటనే గోతులు పూడ్చాలని, కొత్తగా వేసిన రహదారులు తవ్వకుండా ప్రణాళికాయుతంగా చర్యలు చేపట్టాలన్నారు. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ గేట్ల మరమ్మతులకు జీవీఎంసీ నిధుల వినియోగంపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలన్నారు.

'రాజీవ్ గృహకల్ప' పథకంలో నిర్మించిన ఇళ్లకు మరమ్మతులు చేయాలని, ఇప్పటికీ వినియోగించుకోని లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వాలని అధికారులకు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సూచించారు. కప్పరాడ ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేయాలని ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు విష్ణుకుమార్‌రాజు కోరగా అందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విద్యాశాఖాధికారులను ఎంపీ ఆదేశించారు. తప్పుడు పత్రాలు సమర్పించే వ్యక్తులకు విద్యుత్ సౌకర్యం కల్పించవద్దని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కోరారు. ఇంకా ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో క్రీడా మైదానాలు, స్టేడియాలను అభివృద్ధి చేయాలని, వేసవి క్యాంపులు నిర్వహించాలని, ఉద్యానవన, సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ విధానాలను ప్రోత్సహించాలన్నారు. గాజువాక నుంచి లంకెలపాలెం వరకూ సర్వీస్ రోడ్డు అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సూచన మేరకు ప్రతిపాదన చేయాలని సంబంధిత అధికారులకు ఎంపీ ఆదేశించారు. వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లలో కెపాసిటీ పెంచాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, డీఆర్వో భవానీశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ భవన్ వద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేయండి

» అధికారులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి వీరాంజనేయస్వామి ఆదేశం



సంక్షేమ భవన్ సందర్శిస్తున్న మంత్రి వీరాంజనేయస్వామి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ భవన్ వద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. ఎంవీపీ కాలనీలోని సంక్షేమ భవన్‌ను ఆయన గురువారం సందర్శించారు. కార్యాలయం పరిసరాలు ఆహ్లాదంగా ఉండేలా తీర్చిదిద్దాలని సూచించారు. సమావేశమందిరం, ఇతర విభాగాల కార్యాలయాలను పరిశీలించారు. భవన మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన సదుపాయాల గురించి డీడీ రామారావు వివరించారు. ఎమ్మెల్సీ చిరంజీవిరావు, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరకచెట్టు పోలమాంబ ఆలయంలో హుండీ లెక్కింపు

పెదవాల్తేరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరులో వెలసిన శ్రీ కరక చెట్టు పోలమాంబఅమ్మవారి దేవస్థానంలో గురువారం హుండీ లెక్కించారు. 20 రోజలకు గానూ హుండీ లెక్కింపు ద్వారా నగదు రూ.2,63,511 రూపాయలు వచ్చినట్టు దేవస్థానం ఈవో కె.గాయత్రి తెలిపారు. ఈ హుండీ లెక్కింపు దేవదాయ శాఖ పర్యవేక్షణ అధికారి పి.శేఖర్‌బాబు, పెదవాల్తేరు గ్రామ సంఘం సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, 3 టౌన్ పోలీసులు, శ్రీహరిసేవా సభ్యులు, సిబ్బంది తదితరులు హుండీ లెక్కింపు చేసినట్టు తెలిపారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా మంజుల

విశాఖపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల (స్వయంప్రతిపత్తి) ప్రిన్సిపాల్‌గా భీమునిపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మంజులను నియమించారు. ఏడాదిగా ఆమె భీమునిపట్నంలో పనిచేస్తూనే ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి. సురేఖను భీమునిపట్నం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

సినిమా గైడ్

- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, మోహిని (గాజువాక)
- **జాక్ :** రమాదేవి
- **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 18, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు)18, బెండకాయలు 24, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 32, బీరకాయలు 42, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 14, క్యారెట్ 28 దొండకాయలు 20, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది) 48, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 60, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 28, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడ దుంపలు 36, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనస పొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	104
లైవ్ ధర	124
విత్ స్కిన్	218
స్కిన్‌లెస్	228

శ్రుతిమించుతున్న గంజాయి బ్యాచ్ ఆగడాలు

» పాడుబడిన ఓ భవనం ఆవాసంగా ఆగడాలు
» వ్యూహం ప్రకారం గొడవలు సృష్టిస్తూ దుకాణదారులపై దాడులు
» పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితంలేదంటూ స్థానికుల ఆరోపణ



గంజాయి బ్యాచ్ అడ్డాగా చేసుకున్న పాడుబడిన ఇల్లు ఇదే..

మద్దిలపాలెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గంజాయి మూకలకు మద్దిలపాలెం అడ్డాగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు పాడుబడిన ఇంటిని ఆవాసంగా చేసుకొని గంజాయిప్రియులు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారని స్థానికులు అంటున్నారు. వీరు చీకటి పడిన వెంటనే తమ ప్రతాపం చూపుతున్నారు. గంజాయి మత్తులో మునగి తేలుతూ సినీ ఫక్కీలో దోపిడీలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మద్దిలపాలెం జాతీయరహదారిపై ఉన్న లక్కీ వైన్స్ వెనుక శిథిలావస్థకు చేరిన భవనం ఒకటి ఉంది. ఆ భవనం ఎప్పటి నుంచో ఖాళీగా ఉండడంతో పదిహేను, ఇరవై మంది యువకులు ఆ ఇంటిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం నుంచే ఇక్కడకు యువకులు వస్తారు. అప్పటి నుంచి పాడుబడిన ఇంట్లో గంజాయి, మద్యం సేవిస్తారు. చీకటి పడ్డాక రోడ్డు



మత్తు ఇంజెక్షన్లకు వినియోగించే సిరంజీలు



తాగిపడేసిన మద్యం సీసాలు

మీదకు చేరుకుంటారు. హైవే పక్కన ఉన్న చిరు దుకాణాల వద్దకు వెళ్తారు. ముందు వాళ్లలో వాళ్లే గొడవకు దిగుతున్నారు. దుకాణదారులు తమ వ్యాపారం పోతుందని వారిని వారించే లోపు దుకాణంలో వస్తువులు కొల్లగొట్టి పరారవుతున్నారు. టిఫిన్, పాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చిరుతిళ్ల విక్రయ దుకాణాల వద్ద ఇలాంటి దాడులకు పూనుకుంటున్నారు. లేదా టిఫిన్లు చేసి బిల్లు ఇవ్వకుండా గొడవ పడి పారిపోతున్నారు. అంతేకాకుండా ఎవరైనా గొడవపడితే వీరంతా ఒకటై చితకబాదుతున్నారు. ముందుగా ఇద్దరు, ముగ్గురు దుకాణాల వద్దకు చేరుకొని హల్‌చల్ చేస్తారు. ఆకతాయిలను నిలదీస్తే నిమిషాల వ్యవధిలో పదిహేను ఇరవై మంది అక్కడకు చేరుకుంటారు. పెద్దగా కేకలు వేస్తూ రచ్చ చేస్తారు. దీంతో దుకాణదారులు, స్థానికులు బెదిరిపోతున్నారు. ఎందుకొచ్చిన గొడవ అని మిన్నకుండిపోతున్నారు. ఈ గంజాయి మూకలు అటుగా రాకపోకలు సాగించే మహిళల పట్ల కూడా అనుచితంగా ప్రవరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అయితే ఈ గంజాయి మూకలపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి గంజాయి మూకల నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

చకచకా రోడ్డు పనులు



మరమ్మతు చేసిన అనంతరం రోడ్డు

ఆరిలోవ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాల నుంచి హనుమంతవాక జంక్షను వరకు చేపట్టిన పాత జాతీయ రహదారి పనులు చకచకా సాగుతున్నాయి. యంత్రాలతో పాత తారు రోడ్డు పై పొరను పూర్తిగా తీసి వేసి దానిపై కొత్తగా రోడ్డు వేస్తున్నారు.

గత మూడు రోజుల నుంచి ఈ మార్గంలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఎప్పటి నుంచో గోతులమయంగా ఉన్న ఈ మార్గంలో మరమ్మతులు చేపడుతుండడం పట్ల వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించండి

» పాత వెంకోజీపాలెం జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయుల ఇంటింటి ప్రచారం



ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరుతూ జీవీఎంపీ పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ప్రచారం

వెంకోజీపాలెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదుల మౌలిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో డిజిటల్, తరగతి గదుల బోధన ఉంటుందని 15వ పాత వెంకోజీపాలెంలోని జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి అన్నారు. కార్పొరేట్ పాఠశాలలు వద్దు... ప్రభుత్వ పాఠశాలలు ముద్దు అంటూ పాత వెంకోజీపాలెం గ్రామంలోని ఇంటింటికి గురువారం పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ రెసిడెన్సియల్, నవోదయ వంటి పోటీ పరీక్షలకు సిద్ధం చేసి, సీట్లను సాధించడం, జంక్‌ఫుడ్ రహిత పాఠశాలల నిర్వహణ, క్షేత్ర పర్యటనలు, విహారయాత్రలకు విద్యార్థులను ఉపాధ్యాయులు తీసుకువెళ్లడం, పాఠశాలలో ఘనంగా జాతీయ పండుగలు, పాఠశాల వార్షికోత్సవాలు, వివిధ పండుగల, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా చిన్నారుల్లో అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. భాషా, గణిత, సైన్స్ దినోత్సవాలు చేపట్టడం తమ పాఠశాల ప్రత్యేకతని వివరించారు. రెండు సంవత్సరాలు పూర్తయిన విద్యార్థులకు బాల్యం పేరిట తమ పాఠశాలలో చేర్చుకుంటామని తెలిపారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో రూ.వేలకు వేల రూపాయల ఫీజులు చెల్లించి విద్యను నేర్పించడం కన్నా ఉచితంగా అదే ప్రమాణాలను నాణ్యమైన విద్యను తమ పాఠశాలలోనూ అందిస్తున్నామని సూచించారు. అంతేకాకుండా వంద శాతం ఇంగ్లీషు మీడియం, తల్లికి వందనం పథకం వర్తింపు, ప్రతి రోజు నాణ్యమైన భోజనం, 3 జతల యూనిఫాం, ప్రతి రోజూ యోగా, వ్యాయామం, ఆటలు, పాఠశాలలోనే స్వచ్ఛమైన ప్యూరిఫైడ్ తాగునీరు సదుపాయం, పూర్తిగా విద్యుద్దీకరించిన ఆర్‌సీసీ బిల్డింగ్, ప్రతీ ఏడాది ఉచితంగా ఐరన్, ఫోలిక్ మాత్రలు, అల్బెండజోల్ మాత్రల పంపిణీ వంటి కార్యక్రమాలను ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్నారని చిన్నారుల తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

» ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



వాల్తేరు డిపో వద్ద ప్లకార్డులు పట్టుకొని ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

పెదవాల్తేరు. ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం వాల్తేరు డిపో వద్ద ఆర్టీసీ ఉద్యోగులు ప కార్డులతో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వాల్తేరు డిపో ఎన్ఎంయూ డిపో ఛైర్మన్ బి.రవి పాల్గొని మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, త్వరలో రాబోయే ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ ఉద్యోగుల ద్వారా నడపాలని, ఈహెచ్ఎస్ ద్వారా కాకుండా ఉద్యోగులకు పాత విధానంలో వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. నైట్ అవుట్ అలవెన్స్‌లను రూ.150 నుంచి రూ.400కు పెంచాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు అడిగిన వెంటనే చైల్డ్ కేర్ లీవ్ ఏర్పాటు చేయాలని కోరారు. నాన్-ఆపరేషన్ ఉద్యోగులు, గ్యారేజ్ ఉద్యోగులు, సమస్యలు పరిష్కారించాలని కోరారు. అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సంస్థ ద్వారా మాత్రమే జీతాలు చెల్లించాలని, ఆన్ కాల్డ్ డ్రైవర్లకు రోజువారి వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో వాల్తేరు డిపో కార్యదర్శి ఆర్ వసంతరావు, గ్యారేజ్ అధ్యక్షులు కొండలరావు, అధిక సంఖ్యలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

కొట్లాట కేసులో ఇరు వర్గాలపై కేసు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పెదజాలారిపేటలో ఈ నెల 15న రెండు వర్గాల మధ్య జరిగిన గొడవకు సంబంధించి ఎంవీపీ పోలీసులు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు. ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. పెదజాలారిపేటలో రామోలు రాధ, రమేష్ దంపతులు నివాసం ఉంటున్నారు. ఈ నెల 15 రాత్రి పన్నెండున్నర సమయంలో రమేష్ మద్యం మత్తులో వచ్చి బార్య రాధను కొట్టాడు. ఆ సమయంలో స్థానికంగా ఉంటున్న సతీష్, పెద్దయ్య, పోలయ్య ఈ సంఘటన చూసి నవ్వుతుండడంతో రాధ, రమేష్‌లకు కాబోయే అల్లుడు సురేష్ ఆ ముగ్గురిని ఎందుకు నవ్వుతున్నారు, వెళ్లిపోండంటూ కోరాడు. ఈ ముగ్గురితో పాటు వారి బంధువులు పైడిరాజు, వెంకటలక్ష్మి, శ్రీను, సత్తయ్య, నల్లబాబు, సతీష్, ముక్కుడు అప్పన్న మనవడు తదితరులు కర్రలతోనూ, బీరు సీసాతోనూ దాడిచేసి, సతీశ్‌ను అతడి కుటుంబ సభ్యులను గాయపరిచారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా ఫిర్యాదులోని నిందితుడైన తెడ్డు సతీష్ కూడా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రాధ, రమేష్, వారి కుమారుడు పృథ్వీ, సురేష్, వారి బంధువులు వెంకటలక్ష్మి, శ్రీను, దుర్గ, సంధ్య తమ్మై దాడి చేసి, నల్లబాబు ఇంట్లోకి వెళ్లి, బీరువా పగుల గొట్టి, రూ. 1.30 లక్షలు దొంగలించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐమురళీపర్యవేక్షణలో కేసుదర్యాప్తుచేస్తున్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అప్పుఘర్ ప్రాంతానికి చెందిన పదహారేళ్ల బాలిక అదృశ్యమయింది. తండ్రితో కలిసి పనిచేస్తున్న ఓ యువకుడు ఆమెను ప్రేమిస్తున్నట్టు ఫోన్‌కు మెసేజ్‌లు పంపుతుండడంతో తండ్రి ప్రశ్నించాడు. దీంతో ఈనెల 17న బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. హెచ్‌సీ రాంబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంపత్ వినాయగర్ దేవాలయం హుండీ లెక్కింపు

» 21 రోజులకు రూ.16,45,917 ఆదాయం



హుండీ ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈవో శిరీష

సిరిపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : శ్రీ సంపత్ వినాయగర్ దేవాలయం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. గడిచిన 21 రోజులకు రూ.16,45,917 నగదు లభించినట్టు ఆలయ ఈవో కే.శిరీష్, ఫ్యామిలీ ఫౌండర్ మెంబర్ టి.ఆర్.చోళన్ తెలిపారు. గురువారం దేవాలయ ఆవరణలో నిర్వహించిన హుండీ లెక్కింపులో బంగారం 2-977 మిల్లీ గ్రాములు, వెండి 098 గ్రాముల 900 మిల్లీ గ్రాములు, ఒమన్ రియల్ 40, మలేషియా రింగ్గిట్ 1, కతర్ రియల్ 1, రూ.111 చెక్ రూపంలో వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో శ్రీవెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారులుగా బి.ప్రసాద్ దేవాలయ సిబ్బంది జి.గోవింద రెడ్డి, డి.ఎస్.ప్రసాద్, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

» టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

మద్దిలపాలెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పేదల లబ్ధి కోసం అమలు చేస్తున్న పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ పిలుపునిచ్చారు. స్థానిక 22వ వార్డులో గురువారం నిర్వహించిన టీడీపీ వార్డు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నడు లేని విధంగా పేదలు, మహిళలు, కులాలు, యువతకు ఆసరగా నిలిచే వినూత్న పథకాలను ప్రభుత్వం ప్రవేశపెడుతోందన్నారు. ఆయా పథకాలపై ప్రజల్లో ప్రచారం చేసి పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తకు ఉందన్నారు. అలాగేముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ జన్మదినోత్సవాలను ఘనంగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, పడాల డేవిడ్, కోడిబోయిన ఆనంద్, రాజ్‌కుమార్, బర్ల రాజు, అప్పారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

» వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్



ఎంవీపీ సెంట్రల్ నర్సరీలో పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ విశ్వనాథన్

సిరిపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఎంవీపీ సెంట్రల్ నర్సరీలో సుమారు రూ.93 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టరును ఆదేశించారు. తదుపరి ఎన్ఏడీ పై ఓవర్ వద్ద నిర్మిస్తున్న రైల్ ఓవర్ బ్రిడ్జ్ పనులను పరిశీలించి, ఈ పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్, ఇంజనీర్లు బలరామరాజు, మధుసూదనరావు, డీఎఫ్‌వో సుజాతశివానీ, సహాయ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస-పాడువ రైల్వే లైన్‌లో తనిఖీలు



వంతెన వద్ద ట్రాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

విశాఖపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఇంట్రా జోనల్ సేఫ్టీ ఆడిట్‌లో భాగంగా వాల్తేరు డివిజన్ అధికారులు కొత్తవలస - పాడువ మార్గంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ అరుణ్ జె. రాథోడ్ బృందం మేజర్ స్టేషన్లు, లెవెల్ క్రాసింగ్‌లు, యార్డులను తనిఖీలు చేసింది. ఈ కార్యక్రమంలో చీఫ్ ట్రాక్ ఇంజనీర్ డీకే మాలిక్, చీఫ్ పాసింజర్ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజర్ కె.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి, ఖాళీ జాగా పన్నుల చెల్లింపునకు 30 వరకు గడువు

» జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

వెంకోజీపాలెం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలోని గృహ యజమానులు, ఆస్తి పన్ను చెల్లింపుదారులకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ జాగా పన్నుల వడ్డీపై 50 శాతం రాయితీ 2025, మార్చి 31తో ముగిసింది. అయితే ఆ నెలలో ప్రభుత్వ సెలవులు అధికంగా ఉన్నందున చాలా మంది తమ ఆస్తి పన్నుల చెల్లింపులను వినియోగించుకోలేనందున అలాంటి వారి కోసం మరొక అవకాశాన్ని కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నులపై 50 శాతం వడ్డీ రాయితీని ఈ నెల 30 వరకు చెల్లించేందుకు గడువు పొడిగించిందని, ఈ సదవకాశాన్ని పన్నుదారులు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇంచార్జి కమిషనర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 2025, ఏప్రిల్ 1 నుంచి 2026, మార్చి 31 వరకు ఆస్తి, ఖాళీ జాగా పన్నులు ఏక మొత్తంలో ఈ నెల 30వ తేదీ లోగా చెల్లిస్తే ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీని ప్రభుత్వం కల్పించిందన్నారు. కాబట్టి గృహ, ఆస్తి పన్ను చెల్లింపు దారులు ప్రభుత్వం కల్పించిన ఈ సదవకాశాన్ని కూడా వినియోగించుకోవాలని జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ప్రకటనలో పేర్కొన్నారు. నగర ప్రజల సౌకర్యార్థం ప్రతి వార్డు సచివాలయ పరిధిలోని ఇంటి యజమానులు వారి గృహం వద్దకు వచ్చే సచివాలయం కార్యదర్శిని సంప్రదించి ఆస్తి పన్ను బకాయిలను డెబిట్, క్రెడిట్ కార్డు, యూపీఐ ద్వారా చెల్లించవచ్చని లేదా జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, అన్ని జోనల్ కార్యాలయాల సౌకర్యం కేంద్రాలలో గాని, ఐడీబీఐ సిరిపురం, ఐసీఐసీఐ ద్వారకానగర్, పంజాబ్ నేషనల్ బ్యాంకు మదురవాడ, యాక్సిస్ బ్యాంకు రామ్‌నగర్ బ్రాంచిలలో చెల్లించవచ్చునని కమిషనర్ సూచించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళల అదృశ్యం

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భార్య కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు అందింది. హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు వెంకోజీపాలెంలోని చింతాడ స్వామిసాయి, భార్య సావిత్రి (26) ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. ఈ నెల 13న భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. భార్యపై చెయ్యి చేసుకున్నాడు. మరుసటి రోజు ఉదయం భార్య కనిపించలేదు. వివిధ ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఒకటో సెక్టారులో మరో వివాహిత

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ ఒకటో సెక్టారులో ఉంటున్న దన్నన వంశీ తన తల్లి కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తల్లి సుధ, మామ చంటి, వంశీ కలసి నివసిస్తున్నారు. వంశీ కొద్ది రోజులు తన సోదరి ఇంట్లో ఉండి, ఈనెల 15న తిరిగి ఇంటికి వచ్చాడు. ఇంట్లో తల్లి కనిపించకపోవడంతో మామ చంటిని ప్రశ్నిస్తే ఈ నెల 13 నుంచి సుధ (38) కనిపించడం లేదని తెలిపాడు. తల్లి పనిచేస్తున్న యజమాని ఇంటికి వెళ్లి, వంశీ ఆరా తీయగా, 13 నుంచి పనిలోకి రావడం లేదనితెలిపాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మేయర్‌కు అప్పుడు కన్నీరు రాలేదా?

» జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్లు మూర్తియాదవ్, గంధం శ్రీనివాసరావు

విశాఖపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): 'యాదవ సామాజికవర్గానికి చెందిన తనను మేయర్ పీఠం నుంచి దింపడానికి తన సామాజికవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులే కుట్ర చేస్తున్నారని గొలగాని హరి వెంకటకుమారి మొసలికన్నీరు కార్చుతున్నారని జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్‌అన్నారు. వైసీపీ హయాంలో తన సామాజికవర్గం కార్పొరేటర్లకు అన్యాయం జరిగితే కన్నీరురాలేదా?' అని ప్రశ్నించారు. జీవీఎంసీలోని టీడీపీ ఫ్లోర్‌లీడర్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. వంశీకృష్ణ శ్రీనివాస్ కార్పొరేటర్‌గా21వ వార్డులో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కౌన్సిల్‌లో కోరితే మేయర్ పట్టించుకోలేదన్నారు.యాదవ కార్పొరేటర్లు తమ వార్డులో అభివృద్ధి పనులు జరగడం లేదని, నిధులడిగితే సామాజికవర్గం గుర్తుకురాలేదా? అని ప్రశ్నించారు. మేయర్‌గా నాలుగేళ్లు పనిచేసిన హరివెంకటకుమారికి ఇంతవరకు ఫోన్ లేదన్నారు. షాడోమేయర్ అవినీతి నేపథ్యంలోనే అవిశ్వాసం పెట్టాల్సి వచ్చిందన్నారు. కోడివ్యర్థాల పంచాయితీ మేయర్ ఇంట్లోనే జరిగిందన్నారు. మేయర్, డిప్యూటీ మేయర్, వైసీపీ ఫ్లోర్‌లీడర్ ప్రతినెలా మామూళ్లు తీసుకుంటున్నారన్నారు. డిప్యూటీ మేయర్ శ్రీధర్ ఆనందపురం మండలం గిడిజాలలో ఐదెకరాల భూమిని ఆక్రమించారన్నారు. వైసీపీ నేతలు విప్ జారీచేస్తున్నామని వైసీపీ కార్పొరేటర్లను బెదిరిస్తున్నారని, వారికి దానిపై అవగాహనలేదన్నారు.టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాక వైసీపీ సమన్వయకర్తగా యాదవసామాజికవర్గానికి చెందిన వ్యక్తిని నియమిస్తే, అతన్ని తొలగించి అమర్‌నాథ్ టికెట్ లాక్కుంటే మేయర్ ఏం చేశారని ప్రశ్నించారు.

22న సీనియర్ సిటిజన్ల కలయిక

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 22న 'మీట్ గ్రేట్ ట్రీట్' పేరుతో సీనియర్ సిటిజన్స్ కలయిక కార్యక్రమాన్ని కన్సర్న్ చారిటబుల్ ట్రస్ట్, వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు డా.కె.రమాప్రభ, పీకే జోస్ తెలిపారు. వారు పోస్టర్‌ను విడుదల చేశారు.

తవ్విన చోటే తవ్వడం.. చేసిన పనే చేయడం!

» ముందుకు సాగని యూజీడీ పనులు
» కొరవడిన అధికారుల పర్యవేక్షణ
» పట్టించుకోని ప్రజాప్రతినిధులు
» స్థానికులకు తప్పని అవస్థలు



తవ్వకాలతో పాడైన కళింగనగర్ వుడాక్వార్టర్సు రోడ్డు



వుడా కాలనీ చివర సిద్ధార్థ పార్కు రోడ్డు పరిస్థితి ఇదీ..

మురళీనగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని మురళీనగర్, ఎన్జీజీవోస్ కాలనీ, మాధవధార ప్రాంతాల్లో యూజీడీ పనులు ఏళ్లుగా కొలిక్కిరావడం లేదు. పదేపదే చేసిన పనులే చేయడం, తవ్విన చోటే తవ్వడంతోనే సరిపోతోందంటూ అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. దీనివల్ల ఇటుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు, స్థానికులకు ఇబ్బందిగా మారుతోంది.

గ్రేటర్ విశాఖ 51వ వార్డు మాధవధార వుడా క్వార్టర్స్ ఏరియాలో యూజీడీ మ్యాన్‌హోల్ పైపుల అనుసంధానం కోసం రోడ్లను తవ్వేసి, పనులు ముగిసినా పూడ్చకుండా అలాగే వదిలేస్తున్నారు. దీంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. వుడా కాలనీ విద్యుత్ కార్యాలయం వెనుక ఎస్టీ హాస్టల్ రోడ్డులోనూ ఇదే పరిస్థితి. ఎర్రమట్టి దిబ్బలుగా మారిన సిద్ధార్థ పార్క్ రోడ్డులో రోజూ విద్యార్థులు రాళ్ల బాటపైనే రాకపోకలు సాగిస్తున్నారు. వార్డు యూజీడీ కాంట్రాక్టరు నిర్లక్ష్యం, జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా క్షేత్ర స్థాయిలో పనులపై పర్యవేక్షణ కొరవడింది. ఎపుడు కావాలంటే అపుడు పనులు చేసే వెసులుబాటు సదరు కాంట్రాక్టరుకు ఉండటంతో ఈ వార్డుల్లో పదే పదే తవ్వకాలు, మళ్లీ మళ్లీ బిల్లుల మంజూరు, నిర్వహణ పేరుతో ప్రజాధనం లూటీ అవుతోందన్న ఆరోపణలుఉన్నాయి. జీవీఎంసీ ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ సారించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

జన సేనలోకి శివగణేష్



శివగణేశ్‌కు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి మనోహర్, పక్కన దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ జిల్లా మాజీ యువజన విభాగ అధ్యక్షుడు, ఏపీఐఐసీ రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఆళ్ళ శివగణేష్ జనసేన పార్టీలో చేరారు. జనసేన విశాఖ జిల్లా అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విజయవాడ మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ సమక్షంలో చేరినట్టు శివగణేష్ తెలిపారు. ఈ మేరకు ఆయనకు మంత్రి మనోహర్ కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీహరిప్రసాద్, పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త అంగ ప్రశాంతి, బెహరా భాస్కరరావు, తిప్పల వంశీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యమాంబ ప్రధాన పండుగ

కంచరపాలెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కంచరపాలెం మెట్టు వద్ద కొలువైయున్న ముత్యమాంబ అమ్మవారి ప్రధాన పండుగను గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేక అలంకరణ చేశారు. వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.కంచరపాలెం పరిసరాలు, ఇతర ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు విచ్చేశారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు దంపతులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులు అమ్మవారి ఘటాలుతో పసుపు కుంకుమల సమర్పించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద కళా ప్రదర్శనలు అలరించాయి.

'నమో భారతాంబ' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గురుసహస్రావధాని డాక్టర్ కడిమిళ్ళ వరప్రసాద్, ఆచార్య డీవీ సూర్యారావు, సీహెచ్ చిన సూర్యనారాయణ తదితరులు

సీతంపేట, ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో పరవస్తు పద్యపీఠం ఆధ్వర్యంలో భారదేశ వాయుసేన మాజీ ఉద్యోగి, బ్యాంక్ ఉద్యోగుల సంఘం నాయకుడు నాగుల శ్రీనివాసరావు రాసిన నమో భారతాంబ ఖండ కావ్యం ఆవిష్కరణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గురు సహస్రావధాని డాక్టర్ కడిమిళ్ల వరప్రసాద్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచయిత శ్రీనివాసరావు రాసిన సీసపద్యాలు సరళంగా శుద్ధంగా వైవిధ్య అంశాలతో ఉన్నాయని కొనియాడారు. పరవస్తు పద్య పీఠాధిపతి పరవస్తు ఫణిశయన సూరి స్వాగతోపన్యాసం చేశారు. అమరావతి విశ్వసాహితి ప్రధాన కార్యదర్శి సీహెచ్ చిన సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డీవీ సూర్యారావు పుస్తక సమీక్ష చేశారు. పుస్తక రచయిత నాగుల శ్రీనివాసరావు తన స్పందనను తెలిపారు. కార్యక్రమంలో భారతీయ స్టేట్ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కుష్బు, ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆచంట సుష్మ, తదితరులు పాల్గొన్నారు.

గెడ్డల్లో పూడిక తీత పనులు



గెడ్డలో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

మాధవధార, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సమస్యాత్మక గెడ్డ ప్రాంతాల్లో పూడిక తొలగింపునకు జీవీఎంసీ చర్యలు చేపట్టింది. వచ్చే వానాకాలం దృష్ట్యా పేరుకుపోయిన వ్యర్థాల్ని తొలగించి, వరద ముంపు సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మాధవధార వుడా కాలనీ ఎగువ ప్రాంతం నుంచి పారే గెడ్డల్లో ఇపుడు పూడికతీత పనులు ఆరంభించారు. దిగువ హైవే సమీప రామన్నకాలనీ, చిట్టిబాబు కాలనీ, అంబేడ్కర్ కాలనీల్లో ఏటా వాననీటి ముంపు సమస్య ఎదురవుతోంది. ఈ అనుభవాల నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపడుతున్నారు. కాగా, జీవీఎంసీ 50వ వార్డు సాయిరామ్‌నగర్ దిగువ ప్రాంతాలు, 49వ వార్డు పాలిటెక్నిక్ కళాశాల దిగువ మాణిక్యాంబ కాలనీల మధ్యగా పారే గెడ్డల వద్ద అధికారులు వ్యర్థాల తొలగింపు పనులు చేపట్టాలని స్థానిక నివాసితులు కోరుతున్నారు.

మహా పక్షపాతం

... 5వ పేజీ తరువాయి

ఖర్చు చేశారు.

మిగిలిన కార్పొరేటర్లు గగ్గోలు

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం జరిగిన ప్రతిసారీ పలువురు కార్పొరేటర్లు తమ వార్డుల్లో అభివృద్ధి పనులు జరగడం లేదంటూ గగ్గోలు పెట్టేవారు. మేయర్, డిప్యూటీమేయర్లు, ఫ్లోర్ లీడర్‌తోపాటు మరికొందరి వార్డులకే భారీగా నిధులు మంజూరుచేస్తున్నారంటూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కార్పొరేటర్లతో పాటు వైసీపీ సభ్యులు కూడా ఆగ్రహం వ్యక్తం చేసేవారు. దీనిపై వివరణ ఇవ్వడానికి అధికారులు కూడా నీళ్లు నమిలేవారు. రాజకీయ స్వలాభంతో పాటు కాంట్రాక్టర్ల నుంచి పర్సంటేజీల వస్తాయనే భావనతోనే తమ తమ వార్డులకు ఎక్కువ నిధులు మంజూరు చేయించుకున్నారని కార్పొరేటర్లు విమర్శలు గుప్పించినా ఆ నలుగురు మాత్రం మౌనం వహిస్తూ వచ్చారు.

పీజీకి ఫీజు రీయింబర్స్‌మెంట్

... 5వ పేజీ తరువాయి

సుమారు 50కు పైగా ప్రైవేటు పీజీ కాలేజీలు ఉన్నాయి. గతంలో ప్రైవేటు కాలేజీల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం పథకాన్ని వర్తింపచేసింది. వైసీపీ ప్రభుత్వం ప్రైవేటు కాలేజీల్లో పీజీ కోర్సులు చేసే విద్యార్థులకు పథకాన్ని నిలిపేసింది. దీంతో ఆర్థికంగా మెరుగైన విద్యార్థులు మాత్రమే ప్రైవేటు కాలేజీల్లో చేరారు. గత ప్రభుత్వ నిర్ణయంతో అనేక పీజీ కాలేజీల్లో సీట్లు మిగిలిపోయాయి. కూటమి ప్రభుత్వం మళ్లీ పథకాన్ని వర్తించేలా చర్యలు తీసుకోవడంతో విద్యార్థులతోపాటు పీజీ కాలేజీ యాజమాన్యాలు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

ఏయూ పరిధిలోని ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లోని కాలేజీల్లో సుమారు ఐదు వేల మంది విద్యార్థులకు పీజీ చేసే అవకాశం లభించనుంది. మేనేజ్‌మెంట్ కోటా సీట్లు పోయినా కనీసం 3,500 మంది పీజీ కోర్సుల్లో చేరేందుకు వీలుంటుంది. ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రభుత్వం పథకాన్ని వర్తింపజేసే అవకాశం ఉందని సమాచారం. ఈ మేరకు కొద్దిరోజుల్లో ప్రకటన వెలువడుతుందని చెబుతున్నారు.

కౌన్సిల్‌లోకి సభ్యులకు మాత్రమే అనుమతి

... 5వ పేజీ తరువాయి

బాధ్యత రో అధికారులదేనని కలెక్టర్ వివరించారు. ఒక్కో రో అధికారి తమకు కేటాయించిన వరుసలో ఎంతమంది చేతులు ఎత్తారనేది పేర్లతో సహా నమోదుచేసుకుని, కార్యదర్శికి అందజేయాల్సి ఉంటుందని కలెక్టర్ వివరించారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలతో పాటు అదనంగా మరికొన్ని వీడియో కెమెరాలను కూడా ఏర్పాటుచేయాలని ఆదేశించారు. సమావేశం ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీయించాలని కలెక్టర్ ఆదేశించారు.

పటిష్ఠ భద్రత

కౌన్సిల్ సమావేశానికి పోలీసులు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేస్తున్నారు. 19వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకోనున్నారు. జీవీఎంసీ ఉద్యోగులు, వార్డు కార్పొరేటర్లు, ఎక్స్‌అఫీషియో సభ్యులను మినహా మిగిలిన వారు లోపలకు ప్రవేశించకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న సీఎంఆర్ బస్టాప్ నుంచి సంపత్ వినాయగర్ ఆలయానికి వెళ్లే రోడ్డు మినహా జీవీఎంసీ కార్యాలయం చుట్టూ ఉన్న రోడ్లను బారికేడ్లతో మూసివేయనున్నారు. ఆ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 210 మంది శాంతిభద్రతల విభాగం సిబ్బంది, 90 మంది ట్రాఫిక్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేయాలని పోలీస్ అధికారులు నిర్ణయించారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల వెల్లువ

... 5వ పేజీ తరువాయి

చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలను ఇప్పటికే పూర్తిచేశారు. కానీ ఆయా వార్డులు/గ్రామాలకు కేటాయించిన యూనిట్ల జాబితాను అనేకచోట్ల ఫైనల్ చేయలేదు. అధికసంఖ్యలో దరఖాస్తులు రావడం, వారంతా నేతల చుట్టూ ప్రదక్షిణలు చేయడమే దీనికి కారణమని తెలుస్తోంది. కొన్నిచోట్ల నాయకులు ఫైనల్ జాబితాను అధికారులకు పంపారు. రుణాలకు ఎంపికైన వారితో జూన్ ఆరో తేదీ నాటికి యూనిట్లను గ్రౌండింగ్ చేయించాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు ప్రక్రియను వేగవంతం చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. అయితే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొలిక్కి రాకపోవడం సమస్యగా మారిందంటున్నారు.

విల్లింగ్‌కు బ్యాంకులు నో..

వివిధ ఉపాధి యూనిట్లకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ అందిస్తుండగా, 50 శాతం బ్యాంకు రుణంగా ఇస్తుంది. కానీ కొన్నిచోట్ల బ్యాంకులు రుణాలు అందించేందుకు ముందుకురావడం లేదని తెలుస్తోంది. పాత రుణాలున్న వారికి, క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉన్నవారికి రుణాలివ్వలేమని బ్యాంకు అధికారులు తేల్చి చెబుతున్నారు. యువత, రైతులు గతంలో బ్యాంకుల నుంచి తీసుకున్న వ్యవసాయ రుణాలు మాఫీ అవుతాయన్న ఆశతో చెల్లించలేదు.దీంతో క్రెడిట్ స్కోర్ తగ్గిపోయింది. ఇది తాజా సబ్సిడీ రుణాల మంజూరుకు అవరోధంగా మారిందంటున్నారు.

అభివృద్ధిలో ముందుండాలి

... 5వ పేజీ తరువాయి

సందర్భంగా జిల్లాలో అమలవుతున్న పథకాల వివరాలను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ వివరించారు.

నగరంలో తవ్విన రోడ్లు వెంటనే పూడ్చండి

వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం నగరంలో తవ్విన రోడ్లను వెంటనే పూడ్చాలని ఎంపీ శ్రీభరత్ ఆదేశించారు. భూగర్భ విద్యుత్ లైన్లు, తాగునీటి పైపులైన్లు, యూజీడీ ఏర్పాటుకు పలుచోట్ల రోడ్లను తవ్వేస్తున్నారని, వాటి వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేలు గణబాబు, పంచకర్ల రమేష్‌బాబు ప్రస్తావించడంతో ఎంపీ స్పందించారు. నిర్దేశించిన పనులు పూర్తయిన వెంటనే గోతులు పూడ్చాలని, కొత్తగా వేసిన రహదారులు తవ్వకుండా ప్రణాళికాయుతంగా చర్యలు చేపట్టాలన్నారు. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ గేట్ల మరమ్మతులకు జీవీఎంసీ నిధుల వినియోగంపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలన్నారు.

'రాజీవ్ గృహకల్ప' పథకంలో నిర్మించిన ఇళ్లకు మరమ్మతులు చేయాలని, ఇప్పటికీ వినియోగించుకోని లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వాలని అధికారులకు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సూచించారు. కప్పరాడ ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేయాలని ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు విష్ణుకుమార్‌రాజు కోరగా అందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విద్యాశాఖాధికారులను ఎంపీ ఆదేశించారు. తప్పుడు పత్రాలు సమర్పించే వ్యక్తులకు విద్యుత్ సౌకర్యం కల్పించవద్దని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కోరారు. ఇంకా ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో క్రీడా మైదానాలు, స్టేడియాలను అభివృద్ధి చేయాలని, వేసవి క్యాంపులు నిర్వహించాలని, ఉద్యానవన, సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ విధానాలను ప్రోత్సహించాలన్నారు. గాజువాక నుంచి లంకెలపాలెం వరకూ సర్వీస్ రోడ్డు అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సూచన మేరకు ప్రతిపాదన చేయాలని సంబంధిత అధికారులకు ఎంపీ ఆదేశించారు. వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లలో కెపాసిటీ పెంచాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, డీఆర్వో భవానీశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్ పోస్టర్ ఆవిష్కరణ

మహారాణిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అందుబాటులోకి తీసుకువచ్చిన 9552300009 వాట్సాప్ నెంబరు ద్వారా అన్ని రకాల ప్రభుత్వ సేవలను సులభంగా పొందవచ్చని ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. గురువారం వారు కలెక్టరేట్‌లో వాట్సాప్ గవర్నెన్స్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలు సులభరీతిలో సేవలను పొందవచ్చునని చెప్పారు. హాయ్ అని మెసేజ్ చేయడం ద్వారా తమకు కావాల్సిన సేవలను ఎంపిక చేసుకోవచ్చునని చెప్పారు.

తాగునీటి సమస్య లేకుండా చూడండి

మహారాణిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. గురువారం ఆయన అమరావతిలోని సచివాలయం నుంచి కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడా తాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

మహారాణిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖాధికారులు సూచించారు. గురువారం చైతన్య పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రమాదాలు జరిగేటప్పుడు నివారణ చర్యలపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

మే 20న దేశవ్యాప్తంగా సమ్మె

మహారాణిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కేంద్ర కార్మిక సంఘాలు మే 20వ తేదీన సమ్మెకు పిలుపునిచ్చినట్టు ఆయా సంఘాల నాయకులు తెలిపారు. గురువారం వారు నగరంలోని సీఐ టీయూ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మిక చట్టాలను కాలరాస్తుందన్నారు. బ్రిటీష్ హయాంలోనే పోరాడి సాధించుకున్న 44 చట్టాల్లో 29 చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్పు చేయడం దారుణమన్నారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

తగరపువలస, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు జీరుపేటకు చెందిన బైరెడ్ల రామకృష్ణ (36) రెండు రోజులుగా కనిపించడం లేదని అతని కుటుంబ సభ్యులు భీమిలి పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు.అతను కొంతకాలంగా మానసికంగా ఇబ్బంది పడుతున్నాడని,బుధవారం ఇంటి నుంచి వెళ్లిపోయారని చెప్పారు. యువకుడి తండ్రి నారాయణమూర్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

శ్రీప్రకాష్‌లో పురావస్తు సామగ్రి ప్రదర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రముఖ చిత్రకారుడు రమేశ్

సీతమ్మధార, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వారసత్వ దినవోత్సవం సందర్భంగా శ్రీప్రకాష్ విద్యానికేతన్ పాఠశాలలో సృజన ఇంటాక్ క్లబ్ ఆధ్వర్యంలో పురావస్తు ప్రదర్శన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ ప్రదర్శనలో 1915 నుంచి 1980 మధ్య ఉపయోగించిన పురాతన వస్తువులు, ఫొటోల అల్బమ్స్, పట్టు చీరలు, అలంకార వుస్తువులు, 100 సంవత్సరాల కాలం నాటి పెండలం గోడ గడియరాలు ప్రదర్శించారు.ఎర్ర చందనపు చెక్క బొమ్మలు, లక్క పిడతలు, ఆనాటి చేద, గాలం, ఇత్తడి, కంచు, రాగి పాత్రలు, 60 సంవత్సరాల క్రితం నాటి రేడియోలు, కెమెరాలు మొదలైనవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బ్రిటీష్ కాలంనాటి కరెన్సీ, నాణేలు, అప్పటి పోలీస్ మెడల్, 50 ఏళ్ల కాలంనాటి బాకులు, తాసు, స్త్రీల అలంకరణ సామగ్రిని భద్రపరచుకునే పేటికలు సందర్శకులకు ఎంతగానో ఆకర్షించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ చిత్రకారులు, ప్రొఫెసర్ రమేష్ మాట్లాడుతూ పురావస్తు సేకరణ ప్రదర్శన ఎంతో అద్భుతంగా ఉందని ప్రశంసించారు. శ్రీప్రకాష్ విద్యానికేతన్ కేవలం చదువుకు మాత్రమే కాకుండా భారతీయ వారసత్వ సంపదను సంస్కృతీ సంప్రదాయాలను అనుసరిస్తూ జరిపే ఇటువంటి ప్రదర్శనలు నిజంగా అభినందించదగినవన్నారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత చిట్టూరి వాసుప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కృతీ సంప్రదాయాలను తెలియజేసే ఈ ప్రదర్శన ఎంతో విజ్ఞాదాయకంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు.

నవజాత శిశు విభాగానికి వైద్య పరికరాలు వితరణ

మహారాణిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లోని నవజాత శిశువు విభాగానికి ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్ సంస్థ రూ. 4 లక్షల విలువ చేసే వైద్య పరికరాలను వితరణగా అందజేసింది. ఈమేరకు ఆ సంస్థ తరఫున ఏఎంసీ పూర్వ విద్యార్థి డాక్టర్ సతీశ్ వైద్య పరికరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్‌కు గురువారం అందించారు. ఈ సందర్భంగా శివానంద్ మాట్లాడుతూ ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్ ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ. 9 లక్షల విలువ చేసే పరికరాలను అందించిందని చెప్పారు.

గత తప్పిదాలపై చర్యలు ఏవీ ?

సింహాచలం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామికి గతంలో జరిగిన చందనోత్సవాల్లో అనేక తప్పిదాలు జరిగాయి. వాటిపై అధికారులు ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. 2021లో జరిగిన చందనోత్సవం కరోనా వల్ల ఏకాంత సేవగా నిర్వహించారు. అప్పుడు దేవస్థానం సిబ్బందిని కూడా దర్శనానికి అనుమతించలేదు. అంతటి కట్టుదిట్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ నలభై మంది రహస్యంగా నిజరూప దర్శనం చేసుకున్నట్టు విమర్శలు వచ్చాయి. దేవస్థానంతో ఎటువంటి సంబంధం లేని వ్యక్తి స్వామివారి నిజరూప దర్శనం చేసుకున్న వీడియో కూడా సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. అలాగే అంతరాలయంలోని మూల విరాట్‌ను ఫొటో తీసి వైరల్ చేశారు. ఈ ఘోర తప్పిదాలపై దేవదాయ శాఖ అధికారులు విచారణ చేపడతామని ప్రకటించారు తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదు.



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

అనాటమీ విభాగంలో వేడుకలు

మహారాణిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్ అనాటమీ విభాగంలో అనాస్కెచ్ 2.0 పేరుతో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు ఆ విభాగానికి సంబంధించి పాఠ్యాంశాలుగా ఉన్న శరీర భాగాలను పెయింట్స్ ద్వారా ప్రదర్శించారు. ఈ ప్రదర్శన సభికులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, వైద్యులు కృష్ణవేణి, రవీంద్ర కిశోర్, రాధిక, గీతాంజలి, భవానీ, వాసంతి, సురేఖ, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు చట్టాన్ని వ్యతిరేకిస్తున్నా..

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



డాబాగార్డెన్స్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ప్రజాస్వామ్యం అరుంధతీ నక్షత్రంలా తయారైందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు.బీజేపీ ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు చట్టాన్ని తాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానని చెప్పారు. గురువారం ఆయన డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మాజీ ప్రధాని వాజ్‌పేయ్, అద్వానీ చేయని చట్టం హఠాత్తుగా చేయాల్సిన అవసరం మోదీ ప్రభుత్వానికి ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. సుప్రీంకోర్టులో వక్ఫ్ బోర్డు ఆస్తులపై వాదనలు విన్న తరువాత భారత రాజ్యాంగం అంటే ఏమిటో కేంద్ర ప్రభుత్వానికి తెలియదనిపించిందన్నారు. తుషార్ మెహతా వాదనలు తుస్ అని ఎగిరిపోయాయని, ముస్లింల భూములతో బీజేపీకి ఏం పని అన్నారు. పార్లమెంట్ కమిటీ తెచ్చిన బిల్లు కాదని, జగదాంబిక పాల్ అనే ఒకాయన తెచ్చిన బిల్లు ఇదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో తిరిగి రాగానే పూర్వపు వక్ఫ్ బోర్డు చట్టాన్ని తీసుకొస్తామని తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఇస్తున్నట్టు 24 శాతం ఎస్సీ, ఎస్టీలకు, 15 శాతం ఓబీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

రహదారి విస్తరణ ఎప్పటికి పూర్తవుతుందో..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ముందుకు సాగని కూర్మన్నపాలెం-దువ్వాడ రోడ్డు అభివృద్ధి పనులు

ప్రజల ఆశలన్నీ కూటమి సర్కారుపైనే..

ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టి సారించాలని వేడుకోలు


విస్తరణకు నోచుకోని కూర్మన్నపాలెం-దువ్వాడ రైల్వే స్టేషన్ రోడ్డు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కూర్మన్నపాలెం నుంచి దువ్వాడ రైల్వే స్టేషన్‌కు రెండు కిలోమీటర్ల పొడవున గల రోడ్డును 60 అడుగుల నుంచి 100 అడుగులకు విస్తరించేందుకు చేపట్టిన పనులకు మోక్షం కలగడం లేదు. 2023లో రూ.11.39 కోట్లతో ఎంతో అట్టహాసంగా రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు.. ఇందులో భాగంగా తారు రోడ్డు నిర్మాణానికి రూ.3.70 కోట్లు, కాలువలను నిర్మించేందుకు రూ.5.86 కోట్లు, నడక దారి కోసం రూ.1.83 కోట్లను కేటాయించడం జరిగింది.

అయితే 18 నెలలు గడిచినా కేవలం 25 శాతం పనులు మాత్రమే జరగడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్క నీటి విభాగ పనులు మాత్రమే పూర్తవ్వగా, మిగతా పనులు ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్టుగా దర్శనమిస్తున్నాయి. కాలువలు, ఫుట్‌పాత్‌లు, రహదారులు, డివైడర్ ఎలైన్‌మెంట్ మార్పు.. అంటే పాత డివైడర్ తీసి, దాని స్థానంలో కొత్తది నిర్మించి, దానిపై విద్యుత్ స్తంభాల ఏర్పాటు, తదితర పనులు పూర్తి కావాల్సి ఉంది. ఈ పనులు టీడీపీ హయాంలో ప్రారంభమైందన్న అక్కసుతో గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఈ రహదారి పనులు ముందుకు సాగలేదు.

అయితే ఎన్నికల ముందు మాత్రం 2023లో హడావుడిగా పనులు ప్రారంభించారే తప్పా వాటిని పూర్తి చేయలేదు. కాగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా ఈ రోడ్డు పనులకు మోక్షం కలగకపోవడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి విస్తరణ పనులపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రహదారి విస్తరణ పనులకు అవరోధాలు..

రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోయిన వారికి నాలుగు రెట్ల టీడీఆర్‌లు ఇవ్వాల్సి ఉంది. సుమారు 166 మంది నుంచి రోడ్డు విస్తరణ పనులకు గాను స్థలాలను సేకరించారు. కానీ 84 మందికి మాత్రమే టీడీఆర్‌లు ఇచ్చారని, మిగిలిన 82 మందికి ఇప్పటికీ వాటిని మంజూరు చేయలేదని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. తమ స్థలానికి సంబంధించి గిఫ్ట్ డీడ్‌లను జీవీఎంసీకి పలువురు ఇచ్చినా ఇప్పటికీ టీడీఆర్‌లు మంజూరు చేయలేదని పేర్కొంటున్నారు. మరికొంతమంది టీడీఆర్‌ల కోసం జీవీఎంసీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం లేకపోవడంతో అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నట్టు తెలిసింది. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా తమకు తగిన న్యాయం జరగుతుందన్న ఆశతో కొంతమంది భవన యజమానులు ఎదురుచూస్తున్నారు.

ఇదిలావుండగా రహదారి అసంపూర్తి పనుల వల్ల వాహనదారులు, దువ్వాడ రైల్వే స్టేషన్‌కు రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, స్టీల్‌ప్లాంట్, వీఎస్ఈజెడ్ కార్మికులతో పరిసర ప్రాంతాలకు చెందిన వేలాది మంది ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తుండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రహదారి విస్తరణ జరిగితే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

గురుకుల పాఠశాలను సందర్శించిన మంత్రి

గోపాలపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి మేహాద్రిగెడ్డ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి గురువారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి పాఠశాలలో నెలకొన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టామని, విద్యార్థులందరూ ప్రభుత్వం అందించే అన్ని వసతులను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, గోపాలపట్నం తహశీల్దార్ సీహెచ్‌వీ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు సత్కారం



విద్యార్థులు, ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబుతో కనకభవానీ, తదితరులు

అగనంపూడి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివిధ కోర్సుల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రథమ, ద్వితీయ సంవత్సర ఇంటర్ విద్యార్థులను గురువారం టీడీపీ 79వ వార్డు మహిళా అధ్యక్షురాలు గొల్లవిల్లి కనక భవానీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జ్ఞాపికలను అందజేసి సత్కరించడంతో పాటు స్వీట్లను అందజేశారు. అలాగే కళాశాలలో ఉత్తీర్ణత శాతం పెంపునకు కృషి చేసిన ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబును సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు బలిరెడ్డి సత్యనారాయణ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై పన్ను చెల్లింపునకు అనూహ్య స్పందన

» జీవీఎంసీ గాజువాక జోన్‌కు రోజుకు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ఆదాయం


పన్ను చెల్లింపుదారులతో కిటకిటలాడుతున్న జీవీఎంసీ సౌకర్యం కౌంటర్

గాజువాక, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్నుపై ప్రభుత్వం రాయితీలు ప్రకటించడంతో వాటి చెల్లింపునకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. ఆస్తిపన్ను వడ్డీపై 50 శాతం తగ్గింపు, వార్షిక ఏడాదికి సంబంధించిన మొత్తం పన్నును ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు ఈ నెలాఖరు వరకు గడువు ఇవ్వడంతో పన్నుల చెల్లింపులకు ప్రజలు ముందుకు వస్తున్నారు. దీంతో రోజుకు రూ.2 కోట్ల నుంచి 3 కోట్ల రూపాయల వరకు ఒక్క గాజువాక జోన్ నుంచే పన్ను రూపేణ జీవీఎంసీకి ఆదాయం చేకూరుతోంది. ఇంతకు ముందు రోజుకు రూ.50 లక్షలు రావడమే కష్టంగా ఉండేదని సంబంధిత సిబ్బంది స్పష్టం చేస్తున్నారు. కాగా పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం జోనల్ కార్యాలయంలో రెండు కౌంటర్లు, వడ్లపూడి, దల్లివానిపాలెం సచివాలయాల్లో ఒక్కొక్క కౌంటర్‌ను జీవీఎంసీ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ నెలలో వచ్చే అన్ని సెలవు రోజుల్లోనూ ఈ కౌంటర్లు పని చేస్తాయని వారు తెలిపారు. పన్ను బకాయిదారులు, ఇప్పటివరకు పన్ను చెల్లించని అసెస్‌మెంట్‌దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జోనల్ కమిషనర్ శేషాద్రి కోరారు.


స్వామివారి ఆకారంలో సమర్పించిన నైవేద్యం

శ్రీవారికి తిరుప్పావడ సేవ

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో గురువారం శ్రీవారికి నిర్వహించిన తిరుప్పావడ సేవ భక్తులను ఎంతో ఆకట్టుకుంది. ప్రధాన అర్చకులు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేదపండితులు వేంకటేశ్వర స్వామిని పంచామృతాలతో అభిషేకించాక వివిధ రకాల పుష్పాలు, తులసీదళాలతో అలంకరించి పూజలు చేశారు. సుమారు 40 కిలోల పులిహోరను శ్రీవారి ముందు ప్రత్యేక వేదికపై స్వామివారి ఆకారంలో రాశులుగా పోసి నైవేద్యంగా సమర్పించారు.

వెంకటాద్రి శ్రీవారి హుండీ ఆదాయం రూ.4,82,589


హుండీలోని నగదు లెక్కిస్తున్న దృశ్యం

పెందుర్తి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం స్వామివారి హుండీ లెక్కింపును చేపట్టారు. 88 రోజులకు గాను రూ.4,82,589 నగదు, ఆభరణాల రూపంలో 8 కిలోల వెండి, 98 గ్రాముల బంగారం లభ్యమైనట్టు ఆలయ వర్గాలు తెలిపాయి.

సినిమా గైడ్

- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2 :** సంగం, శ్రీలీలామహల్, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, మోహిని (గాజువాక)
- **జాక్ :** రమాదేవి
- **కోర్ట్ :** వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 18, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 24, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 32, బీరకాయలు 42, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 14, క్యారెట్ 28 దొండకాయలు 20, బంగాళదుంపలు 18, అరటికాయ (పె) 8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది) 48, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 60, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 28, క్యాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 36, కంద 74, దేముడుచిక్కుడు 64, గోరుచిక్కుడు 34, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 48, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	104
లైవ్ ధర	124
విత్ స్కిన్	218
స్కిన్‌లెస్	228

ఆకట్టుకున్న మిల్లెట్స్ చిత్ర ప్రదర్శన


మిల్లెట్స్‌తో రూపొందించిన ఏసుప్రభు చిత్రాలను తిలకిస్తున్న ప్రజలు

ఎస్.ఎ.డి.జంక్షన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరాజుపాలెం సెయింట్ థామస్ చర్చి ప్రాంగణంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన మిల్లెట్స్‌తో రూపొందించిన ఏసుక్రీస్తు చిత్రాలు చూపరులను అమితంగా ఆకట్టుకున్నాయి. మిల్లెట్స్ ఆర్టిస్ట్ మోకా విజయకుమార్ గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని ఏసుక్రీస్తు 14 ఘట్టాలకు సంబంధించిన మిల్లెట్స్ ఆర్ట్ చిత్ర ప్రదర్శనను చర్చి ఫాదర్ ఇలియాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రకారుడు విజయకుమార్ రాగులు, సజ్జలు, సాములు, ఊదలతో రూపొందించిన ఏసయ్య చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. ఈ ప్రదర్శన మూడు రోజుల పాటు ఉంటుందని, నగరవాసులు తిలకించవచ్చన్నారు. చిత్రకారుడు విజయకుమార్ మాట్లాడుతూ మిల్లెట్స్‌తో చిత్రాలు రూపొందించేందుకు నెల రోజులు పట్టిందన్నారు. ఈ చిత్రాలను వాటికన్ సిటిలో ఉన్న పోప్‌కు భారత్ తరఫున కానుకగా ఇవ్వాలన్నదే తన లక్ష్యమన్నారు. అధిక సంఖ్యలో ప్రజలు ప్రదర్శనను తిలకించారు.

వైభవంగా డొంకాడ దుర్గమాంబ జాతర



అగనంపూడి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి డొంకాడ, ఉక్కు నిర్వాసిత గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత దుర్గ మాంబ జాతరను గురువారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము 5 గంటల నుంచే అమ్మవారి దర్శనాలు ప్రారంభం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి పసుపు కుంకుమలు, మొక్కులు చెల్లించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ కమిటీ, యువజన సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను నిర్వాసిత కాలనీల్లో ఊరేగించాక తిరిగి ఆలయం వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు జరిపారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. బండ్ల వేషాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు దాసరి త్రినాథరావు, అట్టా అప్పారావు, పెంటారావు, డి.సన్యాసిరావు, విశ్వనాథ్, కె.శ్రీను, సత్తిబాబు, బి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా ఫార్మాసిటీ పునరావాస కాలనీ కొత్తపాలెంలో దుర్గమాంబ అనుపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నూకాంబిక ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి అశోక్‌నగర్‌లో ఈ నెల 24 నుంచి మూడు రోజుల పాటు శ్రీనూకాంబిక ఉత్సవాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టరును టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గురువారం గాజువాకలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఉత్సవ నిర్వాహక కమిటీ ప్రతినిధులు రెడ్డిపల్లి ఆనంద్, సీహెచ్ శ్రీనివాసరావు, ఆచారి, మురళీమోహన్, తేజ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పల్లా శ్రీనివాసరావు

బీజేపీ నాయకుడికి నివాళి

పెదగంట్యాడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యుడు ములకలపల్లి ఈశ్వరరావు అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని గురువారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, దల్లి గోవిందరెడ్డి, కూటమి నాయకులు పులి వెంకటరమణారెడ్డి, కరణంరెడ్డి నరసింగరావులు సందర్శించి నివాళులర్పించారు.

సీపీఐ సభలను విజయవంతం చేయాలి

మల్కాపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సీపీఐ 25వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ మల్కాపురం గ్రామ మండలిలో గురువారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ 'పశ్చిమ' కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ మాట్లాడుతూ జిల్లాలో మే 10, 11 తేదీల్లో మహాసభలు జరుగుతాయని, వీటిని ప్రజలందరూ విజయవంతం చేయాలని కోరారు. టిడ్కో ఇళ్లను త్వరితంగా అర్హులైన లబ్ధిదారులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌పై సుప్రీంకోర్టుకు వెళతాం'

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ మూడు గ్రూపులుగా వర్గీకరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ఉందని, దీనిపై సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూల జగజ్జీవన్‌రామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ కులాలను ఉప కులాలుగా వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు లేదని, 341 ఆర్టికల్ ప్రకారం కేవలం పార్లమెంటుకు మాత్రమే ఆ అధికారం ఉందన్నారు. తాజా జనాభా లెక్కలతో శాస్త్రీయమైన డేటా సేకరించాలని తీర్పులో స్పష్టంగా ఉన్నప్పటికీ ఈ ఆర్డినెన్స్‌ను 2011 జనాభా లెక్కలతో చేశారన్నారు. కేవలం రాజకీయ అవసరాల కోసం మాత్రమే ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చారని ఆయన పేర్కొన్నారు.


శిక్షణ పొందుతున్న దివ్యాంగ క్రీడాకారులు

మెడ్‌టెక్ జోన్‌లో వీల్‌చైర్ బాస్కెట్‌బాల్‌లో శిక్షణ

దేశంలోని 21 మంది దివ్యాంగ మహిళా క్రీడాకారులు హాజరు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడ్‌టెక్ జోన్‌లో వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూబీఎఫ్ఐ) ఆధ్వర్యంలో భారతదేశ మహిళా వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. రానున్న ఆసియా-ఓషియానియా జోన్, ఆసియా పారా గేమ్స్-2028 పారాలంపిక్ పోటీల్లో వీరు పాల్గొనేందుకు గాను 14 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన జోన్ సీఈవో జితేంద్రశర్మ మాట్లాడుతూ పారాథెట్లకు అన్ని సదుపాయాలు జోన్‌లో కల్పిస్తున్నామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇక్కడ శిక్షణ పొందేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. అంతర్జాతీయ పోటీల్లో విజయం సాధించి భారతదేశ కీర్తిని మరింత పెంచాలని ఆకాంక్షించారు. కోచ్ జార్జ్ మెథ్రాత్ మాట్లాడుతూ ఈ శిబిరం ఓ గేమ్‌చేంజర్ అని, మొదటిసారిగా మహిళా క్రీడాకారులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారన్నారు. రానున్న పోటీల్లో విజయం సాధించే దిశగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జోన్ అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గ్యాస్ సబ్సిడీ చెల్లించాలంటూ సీపీఎం ఆందోళన

మల్కాపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వంట గ్యాస్ సబ్సిడీ నగదును తక్షణమే వెంటనే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరుతూ సీపీఎం మల్కాపురం జోన్ నాయకులు ఇక్కడి పౌరసరఫరాల శాఖ అధికారి కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన గ్యాస్ సిలిండర్ల సబ్సిడీ సొమ్మును లబ్ధిదారులకు వెంటనే జమ చేయాలన్నారు. చాలామంది లబ్ధిదారులు గ్యాస్ సిలిండర్‌కు తాము నగదు చెల్లించినా ఇంకా ప్రభుత్వం తమ ఖాతాలలో నగదు జమ చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఎస్‌వో కృష్ణ మాట్లాడుతూ అర్హులందరికీ గ్యాస్ సబ్సిడీ సొమ్ము చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పైడిరాజు, లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, ఎ.సత్యారావు, ఆర్.విమల, పి.వరలక్ష్మి, పి.రామారావు. జగ్గునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత



విజేతలకు బహుమతులు అందజేసిన వీవీ కృష్ణారావు, మురళీకృష్ణ

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్, డైరెక్టర్ వీవీ కృష్ణారావులు పేర్కొన్నారు. 88వ వార్డు గ్రీన్‌సిటీ లక్ష్య బ్యాడ్మింటన్ అకాడమీలో అంతర్జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ ఎం.వి.మురళీకృష్ణ పర్యవేక్షణలో రాష్ట్ర స్థాయి బాలబాలికల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి గురువారం నగదు బహుమతులు, స్పోర్ట్స్ కిట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ క్రీడల్లో ఉత్తమ ప్రతిభను కనబరచి దేశ ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపించేలా క్రీడాకారులు కృషి చేయాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేస్తున్న కోచ్ మురళీకృష్ణను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాగంటి ఐటీ సొల్యూషన్ ఛైర్మన్ మాగంటి లక్ష్మీప్రసాద్, వరల్డ్ చాంపియన్‌షిప్ మెడలిస్ట్ కేపీ నాయక్, ఐఎఫ్‌సీఏఐ బ్యాంక్ మాజీ ఛైర్మన్ ఈ.శంకరరావు, వైజాగ్ ప్రొఫైల్స్ ప్రతినిధులు రమేశ్, సురేశ్, మల్లికార్జునరావు, సునీల్, గణేశ్, వెలగ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

'రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి'

గాజువాక, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సహాయం చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతుందన్నారు. 21 నుంచి 50 ఏళ్ల వయసు కలిగినవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. తమ పార్టీ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచితంగా దరఖాస్తులను నమోదు చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు శ్రీనివాసరావు, ప్రసన్నకుమారి, లక్ష్మి, శంకరమ్మ, మధు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పవిత్ర శుక్రవారం



మానవాళి కోసం జీసస్ ప్రాణత్యాగం చేసిన రోజు

క్రైస్తవులు సంతాప దినంగా పాటించే గుడ్ ఫ్రైడే

- ఏసు క్రీస్తు త్యాగాన్ని స్మరించుకుంటూ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ఆదివారం జీసస్ పునరుత్థానం
- ఈస్టర్ సండే పేరుతో పండుగ

చోడవరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మానవాళి పాపాల కోసం ఏసు క్రీస్తు తన ప్రాణాన్ని త్యాగం చేసిన రోజును క్రైస్తవులు గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటారు. కొన్ని ప్రాంతాల్లో గుడ్ ఫ్రైడేని బ్లాక్ ఫ్రైడే లేదా హోలీ ఫ్రైడేగా పిలుస్తుంటారు. ఏసు క్రీస్తు శిలువ వేయబడిన ఈ రోజును సంతాప దినంగా క్రైస్తవులు పాటిస్తారు. చర్చిలలో ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించడం, నాడు క్రీస్తును శిలువ వేసి తీవ్రంగా బాధించిన ఘటనలకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ఆయన త్యాగాన్ని గుర్తు చేసుకుంటారు. శిలువపై ప్రాణాలు పోయే చివరి క్షణాల్లో సైతం అమ్మలారా నా కోసం ఏడవకుండి, మీ కోసం మీ బిడ్డల కోసం ఏడవండి అంటూ ఏసు క్రీస్తు మాట్లాడిన మాటలు ప్రతి క్రైస్తవుడి హృదయాన్ని తట్టి లేపుతాయి.

ప్రజలకు శాంతి, ప్రేమ, కరుణ, క్షమాగుణంపై ప్రజలకు శాంతి సందేశాలు ఇస్తున్న జీసస్ తీరు నచ్చని నాటి రోమన్ పాలకులు, ఆయనపై రాజద్రోహం, దైవదూషణ వంటి నేరాలను ఆపాదిస్తూ మరణశిక్ష విధిస్తున్నట్టు హుకుం జారీచేస్తారు. ఈ ఆదేశాల మేరకు నాటి రోమన్ సైనికులు జీసస్‌ను చిత్రహింసలకు గురిచేస్తూ పురవీధులుగా గుండా ఈడ్చుకుంటూ, శిలువను అతనితోనే మోయిస్తూ, బహిరంగంగా శిలువపై మేకులతో కొట్టి వేలాడదీస్తారు. చిత్రహింసలు అనుభవిస్తూ శిలువపైనే జీసస్ కన్నుమూస్తారు. అనంతరం అతని భౌతిక కాయాన్ని ఒక గుహలో ఉంచుతారు. ఎన్నో కష్టాలను అనుభవిస్తూ మృతిచెందిన శుక్రవారం రోజును క్రైస్తవులంతా గుడ్‌ఫ్రైడేగా పాటిస్తూ, అతని త్యాగాన్ని స్మరించుకుంటారు. గుడ్‌ఫ్రైడేను బాధాతప్త హృదయాలతో, వేదనతో జరుపుకునే పవిత్రదినంగా చెప్పుకుంటారు. గుడ్‌ఫ్రైడే రోజున ప్రతి క్రైస్తవుడు చర్చికి వెళ్లి తన పాపాలను జీసస్ క్షమించాలని కోరుకుంటూ, ఏసుక్రీస్తు అనుభవించిన కష్టాలను స్మరించుకుంటూ ప్రార్థనలు చేస్తారు.

శ్రమదినాలు (లెంట్ డేస్)

దైవ కుమారుడైన ఏసు క్రీస్తు మరణం, పునరుత్థానం అద్వితీయమైన ఘట్టాలు. వాటిని స్మరించుకుంటూ... దైవ చింతనకు, సేవకు పునరంకితం కావడానికి ఉద్దేశించిన రోజులు... 'లెంట్ డేస్' లేదా 'శ్రమదినాలు'. క్రీస్తు మరణానికి ముందు ఉండే నలభై రోజులను 'శ్రమదినాలు' అంటారు. ఏసు క్రీస్తు తనంతట తానుగా పట్టుబడి, రోమన్ సైనికుల ద్వారా శిలువ శిక్షకు గురికావడానికి ముందు... 40 రోజుల పాటు ఎడారిలో ఉన్నాడు. తన తండ్రి అయిన దేవుణ్ణి ధ్యానిస్తూ ఉపవాస దీక్ష పాటించాడు. దానికి గుర్తుగా ఆ 40 రోజుల్లో క్రైస్తవులు ఉపవాసాలు చేస్తారు. ఒక్కపూట మాత్రమే ఆహారం తీసుకుంటూ ఉపవాస ప్రార్థనలు నిర్వహిస్తారు. కొందరు వారానికి ఒకరోజు పూర్తిగా ఉపవాసం చేస్తారు. ఈ దీక్షా కాలంలో నల్లని లేదా తెల్లని దుస్తులు ధరిస్తారు. మద్యం, మాంసాహారాలకు, విందులకు, విహారాలకు దూరంగా దేవుని మార్గంలోనే ఉండిపోతారు. దాన ధర్మాలు చేస్తూ, ఇతరుల పట్ల ద్వేష భావాన్ని తొలగించుకొని, స్నేహంతో, ప్రేమపూర్వకంగా ఉండాలి. గుడ్‌ఫ్రైడే అనంతరం వచ్చే ఆదివారం ఈస్టర్ పండగతో ముగుస్తుంది.



గుడ్ ఫ్రైడే సందర్భంగా నగరానికి చెందిన ఆర్టిస్ట్ మోకా విజయకుమార్ మిల్లెట్స్‌తో రూపొందించిన ఏసుక్రీస్తు శిలువ మోస్తున్న చిత్రం

జీసస్ చివరి మాటలు

శిలువపై చిత్రహింసలు అనుభవిస్తూ జీసస్ పలికిన చివరి మాటలు క్రైస్తవులకు ప్రాధాన్యమైనవి. రోమన్ సైనికులు చిత్రహింసలు పెట్టడాన్ని చూసి తట్టుకోలేని మహిళలు రోదిస్తుండడం చూసిన జీసస్ నా కోసం ఏడవకండి, మీ కోసం మీ బిడ్డల కోసం ఏడవండి అని ఊరడించే పలుకులు క్రైస్తవుల హృదయాల్లో చెరగని శిలాక్షరాలుగా ఉంటాయి. 'తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరికి తెలియదు. కనుక వీరిని క్షమించుము' అంటూ తనను హింసిస్తున్న సైనికుల గురించి తన తండ్రికి నివేదిస్తూ జీసస్ పలికిన చివరి ఏడు పలుకుల్లో మొదటిది. అలాగే 'నేడు నీవు నాతో కూడా పరలోకంలో ఉంటావు. అమ్మా ఇదిగో నీ కుమారుడు. ఇదిగో నీ తల్లి. నా దేవా నా చెయ్యి ఎందుకు విడచితివి? నేను దాహంతో ఉన్నాను, సమాప్తమైనది. తండ్రీ నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాను' అంటూ ప్రాణాలు విడిచే ముందు జీసస్ మాట్లాడిన ఈ మాటలను గుడ్‌ఫ్రైడే సందర్భంగా గుర్తు చేసుకుంటారు.

జీసస్ పునరుత్థానానికి ప్రతీక ఈస్టర్

జీసస్‌ను శుక్రవారంనాడు శిలువ వేసి, చిత్రహింసలకు గురి చేయడంతో ప్రాణత్యాగం చేస్తాడు. రోమన్ సైనికులు ఆయన భౌతిక కాయాన్ని శిలువ వేసిన ప్రాంతానికి సమీపంలోని ఓ గుహలో సమాధి చేస్తారు. అయితే మూడవ రోజైన ఆదివారం జీసస్ ప్రాణాలతో పునరుత్థానుడవుతాడు. జీసస్ పునరుజ్జీవం పొందడాన్ని క్రైస్తవులు ఈస్టర్ పండుగగా భావిస్తూ ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. శిలువ వేసిన రోజున జీసస్ కష్టాలను తలచుకుంటూ వేదనతో గుడ్‌ఫ్రైడేను పాటించే క్రైస్తవులు.. ఒక రోజు విరామం అనంతరం వచ్చే ఆదివారంనాడు ఈస్టర్ పండగను జరుపుకుంటారు.

21న కంచి వర్సిటీలో ప్రవేశాలు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కంచి విశ్వ విద్యాలయంలో ప్రవేశాల ప్రక్రియను ఈ నెల 21న శంకరమఠంలో నిర్వహించనున్నట్టు కంచి కామకోటి శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ రవిరాజు తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమానికి వర్సిటీ వీసీ ఆచార్య కె.వెంకటర రమణన్, ఫ్యాకల్టీ డాక్టర్ డి.నాగేశ్వరరావు, డీన్, సిబ్బంది హాజరవుతారన్నారు.

మహిళా రక్షణకు 'కలిసికట్టుగా' చక్కని వేదిక

- పోక్సో కేసుల్లో అధికంగా 18 నుంచి 20 ఏళ్లలోపు వారే
- హోం మంత్రి వంగలపూడి అనిత

సిరిపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకు, ధైర్యానికి 'మహిళా రక్షణకు కలిసికట్టుగా' అనే కార్యక్రమం చక్కని వేదికగా అవుతుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. రాష్ట్రంలో తొలిసారిగా ఈ కార్యక్రమానికి విశాఖలో శ్రీకారం చుట్టామన్నారు. ఈ మేరకు గురువారం సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో విశాఖపట్నం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మహిళా రక్షణకు కలిసికట్టుగా' రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని ఆమె జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ స్త్రీలకు రక్షణ కల్పించడం, గౌరవించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. పోక్సో చట్టం, అందులోని అంశాలు యువతకు తెలియజేయడమే లక్ష్యమన్నారు. 15 సంవత్సరాల నుంచి మహిళల పట్ల ఎలా మెలగాలో, వారికి ఎలాంటి గౌరవం ఇవ్వాలో తెలియజేయడమే ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి కళాశాలలో అవగాహన కార్యక్రమాలను చేపడతామన్నారు. యువత లక్ష్యాలను నిర్దేశించుకుని సాధన కోసం కష్టపడాలన్నారు. భ్రమల్లో పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు.

పోక్సో కేసుల్లో 18 నుంచి 20 సంవత్సరాలలోపే వారే అధికంగా ఉండడం బాధాకరమన్నారు. ఇటీవల విశాఖ కేంద్ర కారాగారం తనిఖీ చేశానని, అక్కడ గంజాయి కేసుల్లో పట్టుబడిన వారిలో చిన్నవయసు వారే ఎక్కువగా ఉన్నారన్నారు. యువత భవిష్యత్తును గంజాయి నాశనం చేస్తోందని, దానికి దూరంగా ఉండాలన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఔన్నత్యాన్ని కాపాడేందుకు రాజకీయాలకు అతీతంగా వీసీని నియమించామన్నారు.కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ఇప్పటివరకు ఎవరినీ హౌస్ అరెస్టులు చేయలేదని గుర్తుచేశారు. తిరుపతిలో పోలీసులు ఎవరినీ నిర్బంధించలేదన్నారు. నగర పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి మహిళలకు రక్షణకు నిర్దేశించిన కలిసికట్టుగా కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత్త అవగాహన కల్పిస్తామన్నారు. ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు అజిత వేజెండ్ల, లతామాధురి, పోలీస్, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి వంగలపూడి అనిత

పరిశ్రమలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలం

- శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స ఆరోపణ



విలేకరులతో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ, చిత్రంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, తైనాల విజయకుమార్ తదితరులు ఉన్నారు

విశాఖపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి నేతల అవినీతికి పరిశ్రమలు విలవిల్లాడుతున్నాయని శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. బీచ్‌రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి పార్టీల చెందిన నేతలు పరిశ్రమల నిర్వాహకులను వేధిస్తున్నారన్నారు. దీంతో రాష్ట్రంలో పరిశ్రమల మనుగడే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇప్పటికే జిందాల్ తరలిపోయిందని, కడప జిల్లాలో సిమెంట్ పరిశ్రమను మూయించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పల్నాడు జిల్లాలో పరిశ్రమలను మూసివేయించారని ఆరోపించారు. మూడు, నాలుగు నెలల కిందట విద్యుత్ కర్మాగారం వద్ద ఫ్లైయాష్ కోసం జరిగిన గొడవను అందరూ చూశారన్నారు. కృష్ణపట్నంలో పవర్‌ప్రాజెక్టు జనరల్ మేనేజర్‌పై దౌర్జన్యం చేశారని ఆరోపించారు. ఎచ్చెర్లలోని మద్యం ఫ్యాక్టరీ నుంచి వెళ్లే ప్రతి లోడుకు మామూళ్లు ఇవ్వాలని స్థానిక ప్రజాప్రతినిధులు దౌర్జన్యం చేస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు శాంతి భద్రతలు చక్కగా ఉన్నాయని, పెట్టుబడులు తరలి వస్తున్నాయని గొప్పగా చెబుతున్నారని, వాస్తవ పరిస్థితి విరుద్ధంగా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో పరిశ్రమల మనుగడే ప్రశ్నార్థం కాబోతుందని ఆందోళన వ్యక్తంచేశారు తిరుపతిలో గోవుల మరణాలను బయటపెడితే కూటమి నేతలు ఎదురుదాడి చేస్తున్నారన్నారు. మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రక్రియ పారదర్శకంగా జరపాలని కలెక్టర్‌ను కోరామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, తైనాల విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను, జరిమానాలు తగ్గించేలా చూడండి

- ఎంపీ, ఎమ్మెల్యేలకు ఏపీ చాంబర్ ప్రతినిధుల వినతి



ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

విశాఖపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఆస్తి (ఇంటి)పన్నులను భూముల విలువల ఆధారంగా నిర్ణయించడంతో పజలపై మోయలేని భారం పడిందని, ఆ ఉత్తర్వులు రద్దుచేసి ఇంటి అద్దె ప్రాతిపదికగా వసూలు చేయాలని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులు పైడా కృష్ణప్రసాద్, కంకటాల మల్లిక్, జి.సాంబశివరావు, ఓ.నరేశ్‌కుమార్ తదితరులు ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, గణబాబులకు గురువారం వినతి పత్రాలు ఇచ్చారు. ప్రభుత్వం ఏటా ఆస్తుల మార్కెట్ విలువలను పెంచుతున్నదని, వాటిని ఆధారంగా చేసుకొని కార్పొరేషన్ అధికారులు ఆస్తిపన్ను పెంచుతున్నారని, ఇది భారంగా ఉందన్నారు. బకాయిలపై 24 శాతం వడ్డీ వసూలు చేస్తున్నారని, దానిని 12 శాతానికి తగ్గించాలన్నారు. బకాయిలు చెల్లించేటపుడు తెలంగాణా జరిమానా, వడ్డీలపై 90 శాతం రాయితీ ఇస్తోందని, ఏపీ ప్రభుత్వం కేవలం 50శాతమే ప్రకటించిందన్నారు.

24న తొలివిడత చందనం అరగదీత

సింహాచలం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామికి పైపూతగా సమర్పించే చందనం అరగదీత కార్యక్రమానికి ఈనెల 24న మూహూర్తం నిర్ణయించినట్టు ఈఓ కొమ్ముల సుబ్బారావు ప్రకటించారు. ఏటా స్వామిపై పన్నెండు మణుగుల చందనాన్ని (సుమారు 500 కిలోలు) నాలుగు విడతలుగా స్వామికి సమర్పించడం ఆచారంగా వస్తోంది. ఇందులో భాగంగా చందనయాత్ర నాటి సహస్ర ఘటాభిషేకం తరువాత అదే రాత్రి తొలివిడతగా మూడు మణుగులు (125 కిలోలు), వైశాఖ పౌర్ణమి, జేష్ఠ పౌర్ణమి, ఆషాడ పౌర్ణమి రోజుల్లో మిగిలిన మూడువిడతల చందన సమర్పణ పురూరవ చక్రవర్తి కాలం నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఇందుకోసం కర్ణాటక అటవీశాఖ నిర్వహించిన ఈ వేలంలో పాల్గొని నాలుగేళ్లకు సరిపోయే మంచి గంధపు చెక్కలను అధికారులు కొనుగోలు చేసి ఆలయ భాండాగారంలో నిల్వచేశారు.

టీసీఎస్‌కు చౌకగా భూములివ్వడం చట్ట విరుద్ధం

- పూర్వ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ

విశాఖపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కార్పొరేట్ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)కు ఎకరా 99 పైసలు చొప్పున రుషికొండలో 21.6 ఎకరాలు కేటాయించడం చట్ట విరుద్ధమని పూర్వ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ ఆరోపించారు. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు గురువారం లేఖ రాశారు. ఆ సంస్థ ఎన్ని ఏళ్లలో 12వేల మందికి ఉద్యోగాలు ఇస్తుందో ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి కంపెనీలు అనేకం విశాఖలో భూములు తీసుకొని ఇప్పటివరకు కార్యకలాపాలు ప్రారంభించలేదన్నారు. రుషికొండలో ఎకరా భూమి రూ.15 కోట్లు ఉందని, ఆ లెక్కన టీసీఎస్‌కు ఇచ్చిన భూమి విలువ రూ.320 కోట్లు అన్నారు. టీసీఎస్ గత ఏడాది రూ.62,165 కోట్ల లాభం ఆర్జించిందని, అటువంటి సంస్థకు తక్కువ ధరకు ఇవ్వడం తగదన్నారు. తక్షణం భూ కేటాయింపు రద్దుచేయాలని డిమాండ్ చేశారు. గతంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు నేవీ, ఎల్ఐసీ, ఈఎస్ఐలకు రాష్ట్ర ప్రభుత్వం ధరలు నిర్ణయించి, వసూలు చేసిందని గుర్తుచేశారు.

పారదర్శకంగా కౌన్సిల్ సమావేశం నిర్వహించాలి

- కలెక్టర్‌కు వైసీపీ నాయకుల వినతి



కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న గుడివాడ అమర్‌నాథ్, వైసీపీ నేతలు

మహారాణిపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మేయర్‌పై కూటమి కార్పొరేటర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం మేరకు ఈ నెల 19న జరగనున్న జీవీఎంసీ కౌన్సిల్ ప్రత్యేక సమావేశాన్ని పారదర్శకంగా నిర్వహించాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు గురువారం నాయకులతో కలిసి కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. అవిశ్వాస తీర్మానం ఇచ్చిన నేపథ్యంలో సమావేశంపై అనేక అనుమానాలున్నాయని, ప్రలోభాలతో కూటమి నేతలు మేయర్ పీఠం దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఓటింగ్ సమయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మీడియాను అనుమతించాలని, సభ్యులను మినహా మిగిలిన వారిని అనుమతించకూడదన్నారు. అవిశ్వాస తీర్మానం వీగిపోయేందుకు తగిన బలం వైసీపీకి ఉందని, దీంతో విప్ జారీ చేస్తున్నామన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో తైనాల విజయ్‌కుమార్, కేకే రాజు, పేడాడ రమణికుమారి, పల్లా దుర్గారావు ,రవిరెడ్డి, మొల్లి అప్పారావు, తదితరులున్నారు.

క్రైం... crime news

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

గోపాలపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సింహాచలం రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాత గోపాలపట్నం వద్ద గల ట్రాక్‌పై గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించినా ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడికి సుమారు 45 ఏళ్ల ఉంటాయని, టీషర్ట్, షార్టు ధరించి ఉన్నట్టు తెలిపారు. సంబంధీకులుంటే సంప్రదించాలని ఎస్ఐ ఎస్.రామారావు తెలిపారు.

సముద్ర స్నానానికి వెళ్లి విద్యార్థి గల్లంతు

పెదగంట్యాడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పాత గంగవరం మాధవస్వామి ఆలయ సమీపంలోని సముద్రంలో గురువారం ఈతకు దిగిన విద్యార్థి తనూజ్ (14) గల్లంతయ్యాడు. న్యూపోర్టు సీఐ టి.కామేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక శ్రీచైతన్య స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న 9 మంది విద్యార్థులు సైకిళ్లపై పాత గంగవరం బీచ్‌కు వచ్చి సరదాగా సముద్రంలో ఈతకు దిగారు. వీరిలో ఆరుగురు ఒడ్డునే స్నానాలు చేస్తుండగా, లోహిత్, భరత్, తనూజ్ సముద్రంలోకి వెళ్లారు. కెరటాల తాకిడికి తనూజ్ సముద్రంలోకి కొట్టుకుపోతుండడంతో లోహిత్, భరత్ ఒడ్డుకు చేర్చేందుకు విఫలయత్నం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు తీరానికి చేరుకున్నారు. సీఐ కామేశ్వరరావు ఇండియన్ కోస్ట్‌గార్డుకు సమాచారమిచ్చి నలుగురు గజ ఈతగాళ్లను రప్పించారు. వారు కొద్దిసేపు తీరమంతా గాలించారు. ఈలోగా చీకటిపడడంతో గాలింపు చర్యలను నిలిపివేశారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తి అరెస్టు



నిందితుడు అప్పలరాజు

సీతంపేట, ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి): డ్రైవర్‌గా చేరి.. అవిటితనాన్ని ఆసరాగా చేసుకొని డబ్బులు కావాలని అడగడంతో పాటు అశ్లీల చిత్రాలతో వేధింపులకు పాల్పడి, కత్తితో చంపుతానని బెదిరించిన వ్యక్తిని ద్వారకా పోలీసు స్టేషన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీతమ్మధారకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చూకూరి గిరిష్ శారీరక వైకల్యం, మూర్ఛవ్యాధితో బాధపడుతుండేవాడు. తన పనులు, పిల్లలను చూసుకోవడానికి, వాహనం డ్రైవింగ్‌కు సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్స్ లే అవుట్‌లో ఉంటున్న రామెల్ల అప్పలరాజును పనిలో చేర్చుకున్నాడు. కొద్దికాలం పనిచేసిన తర్వాత గిరిష్ శారీరక వైకల్యాన్ని అసరాగా చేసుకొని అశ్లీల ఫోటోలు చూపించి 2022లోనే రూ.లక్ష ఇవ్వాలని బ్లాక్‌మోయల్ చేయడంతో గిరిష్ తన బంధువు ద్వారా ఆ మొత్తాన్ని యూపీఐ ద్వారా బదిలీ చేశారు. అలా బ్లాక్‌మెయిల్ చేస్తూ పలు దపాలు డబ్బు తీసుకున్నాడు. అతడి వేధింపులు ఎక్కువకావడంతో పాటు చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో గిరిష్ ద్వారక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ రమణ నిందితుడ్ని అదుపులో తీసుకొని విచారణ అనంతరం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

నగరంలో విస్తృతంగా వాహనాల తనిఖీ



జాతీయ రహదారిపై కారులోని బ్యాగులను తనిఖీ చేస్తున్న పోలీసులు

విశాఖపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పోలీసులు నగరంలో విస్తృతంగా వాహనాల తనికీలు చేపట్టారు. రాత్రి తొమ్మిది గంటల నుంచి 11 గంటలు వరకు ఆకస్మికంగా అన్ని ముఖ్యకూడళ్ల, రోడ్లపై వాహనాలను పరిశీలించారు. నేర నియంత్రణలో భాగంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని సీపీ శంఖబ్రతబాగ్చి ఆదేశాల మేరకు ఎక్కడికక్కడ వాహనాలను ఆపి రికార్డులను పరిశీలించారు. అనుమానితులను స్టేషన్‌కు తరలించి విచారించారు.

మెడికల్ షాపు యజమాని నిజాయితీ

- రోడ్డుపై దొరికిన రూ.3.60 లక్షలున్న బ్యాగును పోలీసులకు అప్పగించిన వైనం



షణ్ముఖరావుకు నగదు అందజేస్తున్న శివకుమార్. చిత్రంలో సీఐ పార్థసారథి

గాజువాక, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఏమైనా వసువులు పోగుట్టుకుంటే దొరకడం దుర్లభం. కానీ ఓ వ్యక్తి ఏకంగా తనకు దొరికిన రూ.3.60 లక్షలు ఉన్న బ్యాగును నిజాయితీగా పోలీసులకు అప్పగించాడు. దీంతో పోలీసులు అతనిని అభినందించడమే కాకుండా నగదు పోగొట్టు కున్న వ్యక్తికి అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 15న పారిశ్రామిక ప్రాంతంలోని యాదవ జగ్గరాజుపేట ప్రాంతానికి చెందిన ఓ ప్రైవేటు వ్యాన్ డ్రైవర్ ఎం.షణ్ముఖకుమార్ గాజువాకలోని ఓ బ్యాంకులో రూ.3.60 లక్షలు డ్రా చేసి బ్యాగులో పెట్టుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదే రారు. మార్గమధ్యంలో ఆ బ్యాగు ఎక్కడో పడిపోయింది. ఇంటికి వెళ్లి చూసేసరికి బ్యాగు కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. అదేరోజు ఆటోనగర్ వద్ద గాజువాకకు చెందిన కొర్ల శివకుమార్ అనే మెడికల్ షాపు యజమానికి బ్యాగు దొరికింది. అందులో అధిక మొత్తంలో నగదు ఉండడంతో దానిని గాజువాక పోలీసులకు అప్పగించారు. ఈ క్రమంలో గురువారం షణ్ముఖకుమార్ బ్యాగు పోయిందంటూ పోలీసులను ఆశ్రయించారు వివరాలు తెలుసుకున్నాక సీఐ పార్థసారథి ఆ బ్యాగు షణ్ముఖకుమార్‌దేనని నిర్ధారించుకున్నారు. శివకుమార్‌ను స్టేషన్‌కు రప్పించి అతని చేతుల మీదుగానే రూ.3.60 లక్షల నగదును షణ్ముఖరావుకు అప్పగించారు. ఎంతో నిజాయితీతో వ్యవహరించిన శివకుమార్‌ను సీఐతో సహా సిబ్బంది అభినందించారు. పోయిందనుకున్న నగదు తిరిగి లభ్యం కావడంతో షణ్ముఖరావు ఆనందాన్ని వ్యక్తం చేయడంతో పాటు కృతజ్ఞతలు తెలిపారు.

వంశీరెడ్డి మోసం చేశాడు

- నా రాజకీయ వారసుడు దేవన్‌రెడ్డే
- గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

గాజువాక, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీని వీడి వంశీ తనను మోసం చేశాడని, తన రాజకీయ వారసుడు తిప్పల దేవన్‌రెడ్డి అని గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గాజువాక టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయంగా వంశీకి, తమ కుటుంబానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. తన సొంత నిర్ణయంతో పార్టీ మారిన వంశీరెడ్డికి రాజకీయంగా ఎటువంటి సహకారం ఉండదన్నారు. వంశీరెడ్డి జనసేనలో చేరడం తనకు అవమానకరమన్నారు. వైసీపీ తరపున కార్పొరేటర్‌గా గెలిచి జనసేనలో ఎందుకు చేరావంటూ ప్రశ్నించినందుకు తండ్రి అన్న గౌరవం ఇవ్వకుండా దుర్భాషలాడడం తనను ఎంతో బాధించిందన్నారు. తాను జీవితాంతం జగన్ వెంట నడుస్తానన్నారు. కార్యక్రమంలో దేవన్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.